ఆంధ్రజ్యోతి

ANDHRAJYOTHY



జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నిమ్మల రామానాయుడు



రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడును ప్రభుత్వం నియ మించింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు.ప్రస్తుత కేబినెట్‌లో జల వనరుల శాఖ మంత్రిగా ఉన్నారు. జిల్లా పట్ల ఆయనకు మంచి అవగాహన ఉంది. ఎం దుకంటే పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా నుంచి కొవ్వూరు,నిడదవోలు, గోపాల పురం మూడు నియోజకవర్గాలు తూర్పుగోదావరి జిల్లాలో కలిశాయి.అంతే కాకుండా మిగిలిన నాలుగు రాజమహేం ద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి నియోజకవ ర్గాలపై కూడా పట్టుంది. ఇరిగేషన్ మంత్రి కావడం వల్ల ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పనితీరు మెరుగుపరిచే అవ కాశం ఉంది. ఇన్‌చార్జిమంత్రిగా నియమితులైన సందర్భంగా ఆయనను విలేకరులు ప్రశ్నించగా గోదావరి జిల్లాలకు సేవ చేసే అవకాశం లభిం చడం అదృష్టంగా భావిస్తున్నా నన్నారు. రాయలసీమలోని కర్నూలు జిల్లాకు కూడా తనను ఇన్‌చార్జి మంత్రిగా ప్రభుత్వం నియమించిందని చెప్పారు.



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడు, జవహర్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, నిమ్మకాయల చినరాజప్ప, వరుపుల సత్యప్రభ, మిరియాల శిరీష, ఆదిరెడ్డి అప్పారావు, బీవీఆర్ చౌదరి, గన్నికృష్ణ, బూరుగుపల్లి శేషారావు తదితరులు

ఎమ్మెల్సీ విజయం మనదే కావాలి

మళ్లీ సార్వత్రిక ఎన్నికల ఒరవడి కొనసాగాలి.. గెలుపు మనదే కావాలి..మన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇవే మనకు తొలి ఎన్నికలు.. అందరూ కష్టపడాలి.. ఎక్కడా వెనక్కు తగ్గవద్దంటూ నాయకులు పిలుపునిచ్చారు.. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై మంగళవారం రాజమహేంద్రవరంలో కూటమి నాయకులు సమా వేశం నిర్వహించారు.. రేపటి నుంచే పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. అభ్యర్థిని ముందస్తుగా ప్రకటించేలా అధినాయకత్వంతో మాట్లాడదాం.. అభ్యర్థి ఎవరైనా గెలుపు బాట వేయాలన్నారు. - వివరాలు 7లో



ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండండి

చెన్నయ్ రైలు ప్రమాదంతో రైల్వే శాఖ ఉలిక్కిపడింది.. ఎక్కడా అటువంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా చర్యలు చేపడుతోంది. దీనిలో భాగంగా మంగళవారం దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సేఫ్టీ ఆఫీసర్ (పీసీఎస్‌వో) కె.వెంకట రమణారెడ్డి రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌ను ఉదయం నుంచి సాయంత్రం వరకూ పరిశీలించారు.. అణువణువు తనిఖీ చేశారు.. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. - వివరాలు 7లో



మీది.. మంచి ఆహారమేనా!

మా తాత వందేళ్లు బతికాడు.. మా నాన్న 80 ఏళ్లు బతికాడు.. మనం 60 దాటితే గగనమే.. ఇదీ నేటి తరం ఆలోచన.. నాటికి నేటికి తేడా ఏంటి.. ఆహారమే.. నాడు కల్తీ లేని ఆహారం లభించేది.. మరి నేడు అంతా కల్తీయే.. ఇప్పటికైనా ఆహారం మార్చుకుంటే మనం వందేళ్లు బతికేయవచ్చు.. నేడు ప్రపంచ ఆహార దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం. - వివరాలు 6లో

మొక్కల ప్రేమికుడు ఇకలేడు

సత్యదేవ నర్సరీ అధినేత చంటియ్య మృతి



7

ఛీర్స్!



- ఎక్కడికక్కడ ఒక్కటైన సిండికేట్లు
- మళ్లీ బెల్ట్ తీసే యోచన?
- గ్రామాల్లో ఏర్పాటుపై సమాలోచన
- నిడదవోలులో వేలానికి రెడీ?
- మూడు రోజుల్లోనే ఫుల్‌గా
- అద్దెకు షాపుల వెతుకులాట
- డిపోలకు బ్రాండెడ్ మద్యం
- జగన్ మద్యానికి ఇక చెక్

నేటి నుంచి మద్యం షాపులు రెడీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇటు మద్యం వ్యాపారులు.. అటు మద్యపాన ప్రియులకు మంచిరోజులొచ్చాయి.గత ఐదేళ్లగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. బుధవారం నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి. ఇప్పటి వరకూ అమలైన జగనన్న పిచ్చి మద్యం పాలసీకి సమూలంగా తెరపడనుంది. మద్యం విధానంలో కూటమి ప్రభుత్వం సమూలంగా మార్పులు తెచ్చింది. జగన్ ప్రభుత్వానికి భయపడి రాష్ట్రం నుంచి పారిపోయిన అంతర్జాతీయ కంపెనీల బ్రాండ్లు కూటమి ప్రభుత్వం వచ్చాక క్యూ కట్టాయి. దీంతో ఇప్పటికే ఆయా డిపోలకు పాత బ్రాండ్లు వచ్చాయి. నాణ్యమైన సరుకు ఇవ్వడమే లక్ష్యంగా నూతన మద్యం పాలసీ 2024-26ని అమలు చేస్తోంది.జిల్లాలో 125 మద్యం షాపులను లాటరీ విధానంలో సోమవారం కేటాయించిన విషయం తెలిసిందే.

మూడు రోజుల్లో ముస్తాబు..

సోమవారం షాపులు కేటాయించగా తొలి విడత ఫీజు చెల్లింపులు మంగళవారం చాలా వరకూ పూర్తయ్యాయి.ఈ మేరకు మద్యం షాపులకు అబ్కారీ శాఖ ప్రొవిజనల్ లైసెన్సులు జారీ చేస్తుంది. వ్యాపారులకు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ అయిన తర్వాత ప్రభుత్వ మద్యం డిపోల నుంచి సరుకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఆ పోర్టల్ మంగళవారం రాత్రి 12గంటల తర్వాత తెరుచుకోనుంది. అప్పుడు వ్యాపారులు స్టాకు ఆర్డరు పెట్టి ఆన్‌లైన్ ద్వారా సొమ్ము చెల్లించాలి. అనంతరం డిపోల నుంచి దుకాణాలకు మద్యం చేరుకుంటుంది. షాపులను అద్దెకు చూసుకోవడం, ముస్తాబు చేయడం, సరుకు రావడం వంటివి అన్నీ పూర్తయి మొత్తం 125 మద్యం దుకాణాలు పూర్తిగా అందుబాటులోకి రావడానికి మూడు నాలుగు రోజుల సమయం పట్టొచ్చని చెబుతున్నారు.ఇప్పటికే మద్యం షాపులు దక్కించుకున్న వాళ్లు అద్దె షాపుల వెతుకులాటలో ఉన్నారు. చా లా వర కూ గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్న షాపుల్లోనే కొత్త మద్యం షాపులు రానున్నా యి.

సిండికేటు సిత్రాలు..

మద్యం షాపులు దక్కించుకోవడానికి కొందరు సిండికేటుగా ఏర్పడి అప్లికేషన్లు ఇచ్చారు. ఒక్కొక్కరు రూ.2 లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లించి 100 దరఖాస్తులు ఇస్తే దానిలో ఓ ఐదు షాపులు దక్కాయనుకుంటే వంద మందీ ఐదు షాపుల్లో భాగస్వాముల కిందే లెక్క. లైసెన్సు ఫీజు, షాపుల అద్దెలు, మామూళ్లతో పాటు ఆ 100 దరఖాస్తులకు అయిన రూ.2 కోట్లనూ పెట్టుబడిగానే పరిగణిస్తారు. దీంతో భాగస్వాములు ఎక్కువై గొడవలు జరుగుతాయని వ్యాపారస్తులు భయపడుతున్నారు. పైగా ఇప్పటి వరకూ ప్రభుత్వం 20 శాతం మార్జిన్ ఇస్తానని చెప్పిందని అంటున్నారు. మంగళవారం సాయంత్రం ప్రభుత్వం జారీ చేసిన జీవోతో పాటు రౌండింగ్ ఆఫ్‌లు వంటివి పోను 10 శాతమే మార్జిన్ అవుతుందని చెబుతున్నారు. పర్మిట్ రూమ్‌లు ఇవ్వకపోవడంతో భారీగా నష్టపోతామని వాపోతున్నారు. దీంతో అనధికారికంగా ధరలు పెంచి అమ్మే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే బెల్టు షాపులపై అంతర్గతంగా వ్యాపారుల్లో బేరసారాలు జరుగుతున్నాయి. బెల్టు షాపుల పరిధి, ఎక్కడెక్కడ బెల్టు షాపులకు మద్యం అనధికారికంగా సరఫరా చేయాలనే దానిపై చర్చించుకుంటున్నారు. మద్యం షాపులు ఫలానా చోట అని ప్రభుత్వం నిర్దేశిం చకపోవడంతో బెల్టుషాపులకు డిమాండు పెరిగింది.

బెల్ట్‌షాపులకు అనధికార వేలమట!

నిడదవోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రైవేటు మద్యం షాపుల కేటాయింపు పూర్తయ్యింది. నేటి నుంచి అన్ని బ్రాండ్ల మద్యం ప్రియులకు అందుబాటులోకి రానున్నాయి. జిల్లా వ్యాప్తంగా మద్యం షాపులు దక్కించుకునేందుకు సిండికేట్లుగా ఏర్పడి భారీగా దరఖాస్తులను సమర్పించారు. మద్యం షాపులు దక్కించుకున్న సిండికేట్లు బెల్టు షాపులపై ప్రధానంగా దృష్టి సారించాయి. బుధవారం మద్యం షాపులను ప్రారంభించిన వెంటనే బెల్టు షాపులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిడదవోలు మండలంలో ఒక గ్రామ వైసీపీ నాయకుడి పేరున ఒక మద్యం దుకాణం రాగా అతని సిండికేట్‌కు మరో నాలుగు షాపులు వచ్చాయి. సిండికేట్‌లో ఉన్న గ్రామ టీడీపీ నాయకులను అడ్డం పెట్టుకుని అనధికారికంగా బెల్టు షాపులను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాడు. టీడీపీ నాయకులను ముందుపెట్టి కథనడిపితే ఇబ్బందులు ఉండవని పావులు కదుపుతున్నాడు. నిడదవోలు పట్టణ మండల పరిధిలో ఐదు మద్యం దుకాణాలకు సంబంధించి బెల్టు షాపుల నిర్వహణకు రహస్యంగా వేలంపాటలు నిర్వహించేందుకు ఆ వైసీపీ గ్రామ నాయకుడు సిద్ధమయ్యాడు. నిడదవోలు నియోజక వర్గంలో 19 మద్యం దుకాణాలకు 863 టెండర్లు రాగా నిడదవోలు పట్టణానికి సంబంధించి నాలు గు షాపులకు 191 టెండర్లు, మండలానికి సంబంధించి ఐదు షాపులకు 213 టెండర్లు రావడం విశే షం. ప్రస్తుతం ఈ రహస్య అనధికారిక బెల్టు షాపు ల వేలం పాటలపై ఎక్సయిజ్ అధికార్లు దృష్టి సారి ంచాల్సి ఉంది.ఆ వైసీపీ నాయకుడి బెల్టు తీయకపోతే అక్రమ మద్యం ఏరులైపారే అవకాశం ఉంది.



పోకచెక్కలు..తామరగింజలతో దుర్గమ్మకు చీర

రాజానగరం,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆసక్తి.. తపన ఉంటే కష్టమైనా ఇష్టంగా భక్తిశ్రద్ధలతో చేస్తారు.. అబ్బా అనిపించుకుంటారు. మండలంలో చక్రద్వారబంధం దేవిచౌక్‌లో కనకదుర్గమ్మ విగ్రహాన్ని చూసి మంగళవారం అందరూ ఆశ్చర్యపోయారు.ఎందుకంటే అంత ప్రత్యేకంగా అలంకరించారు.ప్రతి ఏడాది దసరా ఉత్సవాల్లో భాగంగా అబ్బురపరిచే రీతిలో అమ్మవారిని అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది.దీనిలో భాగంగానే ఈ ఏడాది ఆరుకిలోల పోకచెక్కలు, 2 కిలోల తామర గింజలతో చీరను నిడదవోలు కనకాచారి స్వయంగా తయారు చేశారు. వారం రోజులు శ్రమించి పోకచెక్కలు, తామర గింజలతో చీర,కిరీటం రూపొందించి అమ్మవారికి సమర్పించినట్టు తెలిపారు. ఈ మేరకు మంగళవారం అమ్మవారికి చీరను అలంకరించారు.కనకాచారికి ఉత్సవ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.





ఖాళీగా ఉన్న ఇసుక ర్యాంప్.. కలెక్టర్ ప్రశాంతి

నేటి నుంచి ఇసుక ఓపెన్

- ఓపెన్ ఇసుక రీచ్‌లలో తవ్వకాలు
- ఎటువంటి యంత్రాలు వినియోగించరాదు
- జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరంసిటీ/రూరల్,అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): ఇసుక రీచ్‌లను కేటాయించబడిన ఎల్‌వన్ అభ్యర్థులు బుధవారం నుంచి తవ్వకాలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి ఇసుక కమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇసుక తవ్వకాలు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలకు అను గుణంగా ఉండాలన్నారు.ఇప్పటికే జిల్లాలో 14 ఓపెన్ రీచ్‌లు కేటాయించామన్నారు.ఎటువంటి యంత్రాలు వినియోగించకుండా కనీసం రోజుకు వెయ్యి మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు చేయాలన్నారు. రీచ్‌లలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమయపాలన పాటించాలన్నారు.ఎటువంటి ఉల్లంఘన లేకుండా చూసుకోవాలన్నారు. ఇసుక తరలించే ప్రతి వాహనానికి జియో టాగింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ మేరకు క్రాస్ చెక్ చేయడంతో పాటు డీవియేషన్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు.ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు తనిఖీలు ముమ్మరంగా నిర్వహించి నివేదికను ఆర్డీవోకి పంపాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఏవి సుబ్బరాజు, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి వై.శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు,ఆర్టీవో ఆర్.సురేష్ పాల్గొన్నారు.

అందుబాటులో ఆఫ్‌లైన్ బుకింగ్‌లు

వినియోగదారులకు ఇసుకను మరింత సులభంగా అందిం చేందుకు బుధవారం నుంచి ఆఫ్‌లైన్ బుకింగ్ అందుబాటులోకి తెచ్చినట్టు కలెక్టర్ చెప్పా రు.ఈ మేరకు జిల్లాలో జేసీ ఎస్.చిన్నరాముడు, జిల్లా మైన్స్ ఏడీ డి.ఫణి భూషణ్ రెడ్డి ఆధ్వ ర్యంలో ఇసుక ఆఫ్‌లైన్ బుకింగ్ నకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్ విభజనలో ఆన్‌లైన్ బుకింగ్ డెలివరీలు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య పూర్తవుతాయని.. ఆఫ్‌లైన్ బుకింగ్‌లు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు లోడ్ చేస్తారని తెలిపారు.ఆధార్ కార్డు, వినియోగదారుడి మొబైల్ నెంబరుతో బుకింగ్ చేస్తే ఓటీపీ వస్తుందన్నారు.

రేషన్ బియ్యం.. పక్కదారి!



ఆగని అక్రమ రవాణా

- కన్నెత్తి చూడని అధికారులు
- ఇటీవల మంత్రి నాదెండ్ల తనిఖీ
- భారీగా పట్టుబడిన బియ్యం
- అయినా కదలని యంత్రాంగం
- వీడని మామూళ్ల మత్తు
- సర్కారు కొనేది రూ.43.40
- కిలో రూ.15కే విక్రయం
- బియ్యం ఇచ్చే చోటే కొనుగోళ్లు

ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనకు వచ్చారు.. జిల్లాలో మూడు రైస్ మిల్లులు తనిఖీ చేశారు.. ఆ మూడు రైస్ మిల్లుల్లోనూ సుమారు 90 వేల కిలోల పైనే రేషన్ బియ్యం పట్టుకున్నారు.. ఈ ఒక్క సంఘటన చాలు జిల్లాలో సివిల్ సప్లయిస్ అధికారులు పనిచేస్తున్నారో లేదో చెప్పడానికి.. ఎందుకంటే సాధారణ తనిఖీల్లో భాగంగా మంత్రి మనోహర్ అక్రమ బియ్యం పట్టుకుంటే.. ఇక్కడే ఉండే అధికారులు దృష్టి పెడితే అక్రమార్కుల ఆటలు సాగుతాయా...? ఒక్కసారి ఆలోచించాల్సిందే మరి..

గోకవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వం మారినా అక్రమార్జనకు అలవాటుపడిన అధికారుల తీరు మారలేదు. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ కనుసన్నల్లోనే చౌక బియ్యం పక్కదారి పడుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ బియ్యంతో దొరికిన అక్రమ వ్యాపారులపై విజిలెన్స్, పౌర సరఫరాల అధికారులు 6ఏ కేసులు పెడుతున్నా బెదరడంలేదు. జిల్లా వ్యాప్తంగా బియ్యం అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు అన్నీ తెలిసి కళ్లు మూసుకుని కూర్చుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి నెల మాత్రమే బియ్యం కొనుగోలు చేసేందుకు అక్రమార్కులు భయపడ్డారు. ఆ తరువాత షరా మామూలేగానే అక్రమ వ్యాపారం సాగుతోంది. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎక్కడికి వెళ్లినా అక్రమ రేషన్ బియ్యం పట్టుకుంటూనే ఉన్నారు.అయినా అక్రమ బియ్యం రవాణా తీరులో మాత్రం మార్పు రావడంలేదు. తాజాగా గత బుధవారం నల్లజర్ల, దేవరపల్లిలో మూడు రైస్ మిల్లుల్లో దాడి చేసి పట్టుకున్నారు.

సర్కారు కొనేది కిలో రూ.43.40

ప్రభుత్వం రేషన్ బియ్యం కిలో రూ.43.40కు కొనుగోలు చేసి రేషన్ కార్డుదారులకు ఉచితంగా అందిస్తోంది. ఆ బియ్యాన్ని కిలో రూ.15 నుంచి రూ.16ల వరకు అక్రమ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. కొందరైతే ఎండీయూ వాహనాల వద్దే కాపుకాచి వినియోగదారుల వద్ద నుంచి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.కొన్ని చోట్ల ఎండీయూ వాహనదారులే బియ్యం కొనుగోలు చేసి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. అనంతరం బియ్యాన్ని ద్విచక్ర వాహనాల్లో రహస్య ప్రాంతాలకు తరలిస్తారు.రాత్రి వేళల్లో దాచిన గొడౌన్‌ల నుంచి బియ్యాన్ని భారీ వాహనాలపై నల్లబజారు, రైస్ మిల్లులకు తరలించేస్తున్నారు.గోకవరం మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 40 శాతం రేషన్ బియ్యం మాఫియా చేతుల్లోకి చేరి పోతుంది. ప్రధానంగా గోకవరం, కామరాజుపేట, తిరుమలాయపాలెం, వెదురుపాక, కృష్ణునిపాలెం, రంపయర్రంపాలెం, తంటికొండ తదితర గ్రామాల్లో అడ్డూ అదుపూ లేకుండా రేషన్ బియ్యం పక్కదారి పడుతుంది. రైస్ మిల్లర్లకు అక్రమ వ్యాపారులు కిలో రూ.30 నుంచి రూ.32ల పైనే విక్రయిస్తున్నట్టు సమాచారం. మిల్లర్లు ఈ బియ్యాన్ని మరోసారి మరపట్టించి, పాలిష్ చేసి వాటినే బ్రాండెడ్ బియ్యంగా బహిరంగ మార్కెట్లో కిలో రూ.40 నుంచి రూ.50ల వరకు విక్రయించుకుంటున్నారు.



గత బుధవారం పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనలో భాగంగా రైస్ మిల్లుల తనిఖీ చేశారు.. మూడు రైస్ మిల్లుల్లో సుమారు 90 వేల కిలోలు పైనే పట్టుబడ్డాయి.. ఆ తరువాత మంత్రి వెళ్లిపోయారు.. అధికారులు మాత్రం నిద్దరోతున్నారు.. నేటికీ ఒక్కరైస్ మిల్లుపై దాడిచేసిన ఘటనలే లేవు ఎందుకో మరి!

అక్రమ వ్యాపారం ఇలా..

గోకవరం మండలంలో పలువురు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తూ కోట్ల రూపాయలు ఆర్జించారనే పుకార్లు ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని..తద్వారా వారి నుంచి చౌకబియ్యం కొనుగోలు చేసి గోకవరంలో ఏర్పాటు చేసుకున్న రహస్య గొడౌన్లకు తరలిస్తున్నారు. కొనుగోలు తతంగం పూర్తయ్యాక వ్యాపారులతో రహస్య సంబంధాలు కొనసాగించే అధికారులకు సమాచారం చేరవేస్తారు. అప్పుడు వారు చెప్పిన రోజున, చెప్పిన సమయంలో టాటా ఏస్‌లు, ఆటోలు, లారీలు, మినీవాహనాలపై ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే విధానంలో సాగుతోంది. పలు దుకాణాల వద్ద రేషన్ బియ్యం క్రయవిక్రయాలు బహిరంగంగానే సాగుతున్నాయి. తిరుమలాయపాలెం నుంచి ఈ అక్రమ వ్యాపారం జోరుగా సాగుతుంది. రేషన్ బియ్యం అక్రమ రవాణా గురించి ప్రభుత్వ అధికారులు, ఇతర శాఖ అధికారులకు తెలిసినా ఏ మాత్రం చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. బియ్యం మాఫియా నుంచి దండిగా మామూళ్ళు అందడం వల్లే వారు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు లేక పోలేదు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ముడుపులు చేరడంతో అక్ర మార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



కాపాడండి : కడియంలో మహిళా శక్తి సంఘం వద్ద వీవోఏల ఆందోళన

ఏపీఎం వేధిస్తున్నారు!

కడియంలో డ్వాక్రా సంఘాల వీవోఏల ఆవేదన

కడియం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : రాజకీయ నాయకులతో కలిసి మహిళా సంఘాల డీఆర్‌డీఏ ఏపీఎం వేధింపులకు గురిచేస్తున్నారని డ్వాక్రా సంఘాలకు చెందిన పలువురు వీవోఏలు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళాశక్తి సంఘం భవనం వద్ద మండలంలోని పలు గ్రామాలకు చెందిన వీవోఏలు ప్రసన్న, లక్ష్మి, పోశమ్మ తదితరులు ఆందోళనకు దిగారు. మేం ఎటువంటి తప్పులు చేయకపోయినా సంఘాల్లో సొమ్ములు గోల్‌మాల్ అయ్యాయంటూ రాజకీయ నాయకులతో కలిసి తమను నానా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. మండలంలో ఓ మహిళా సంఘంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో నిజనిర్ధారణ చేసి సమస్యను పరిష్కరించాల్సిన ఏపీఎం రాజకీయనాయకులతో కలిసి సమస్యను మరింత పెద్దది చేశారని ఆరోపించారు. విచారణ పేరుతో చులకనబావంతో చూస్తున్నారన్నారు. చిరుద్యోగులమని చూడకుండా ఏపీఎం దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు.జీతాలు సకాలంలో రాకున్నా పనిచేస్తున్న తమపై ఇలా జులుం ప్రదర్శించడం తగదన్నారు. విచారణకు భయపడమని..తప్పులు లేకున్నా దోషులుగా నిలబడడంతో ఆవేదనకు గు రవుతున్నామన్నారు.ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.



మీది.. 'మంచి' ఆహారమేనా..

నేడు ప్రపంచ ఆహార దినోత్సవం

మనకున్న ఆహారపు అలవాట్లే ఆరోగ్యానికి దిక్సూచి. ఏం తింటున్నాం, ఎలా తింటున్నాం, ఎంత తింటున్నాం.. ఈ విషయాలే మంచి ఆరోగ్యానికి పునాది వేస్తాయి. కొవిడ్ తర్వాత.. చాలామందిలో ఆహారపు అలవాట్లు మారాయి. పోషక విలువలున్న ఆహారం తీసుకోవడం అధికమైంది. నాణ్యమైన ఆహారం స్వీకరించాలనే అభిరుచి పెరిగింది. అవకాశం ఉన్నవాళ్లు సేంద్రియ ఉత్పత్తులను ఎంచుకొని మరీ ఆహారంగా ఎంచుకుంటున్నారు. మిగిలినవాళ్లు నాణ్యమైన ఉత్పత్తులో కాదో తెలుసుకుని, ఆరా తీసి సదరు ఆహార ఉత్పత్తులను కొంటున్నారు. అదే సమయంలో ప్రజల ఆహారపు అభిరుచులు, అలవాట్లను వ్యాపారంగా మలుచుకుని నకిలీ ఆహార ఉత్పత్తులను వారికి అంటగట్టే మాయాజాలం పెరిగిపోయింది. అవి కల్తీ ఉత్పత్తులో కాదో తెలియనంత మోసం... వాటిని నియంత్రించాల్సిన వ్యవస్థలు చురుకుగా ఉంటేనే నాణ్యమైన ఆహారం ప్రజలకు లభిస్తుంది. నాణ్యతను పరీక్షించే వ్యవస్థలదే ఈ బాధ్యత. మరోవైపు రైతులు సేంద్రియ ఉత్పత్తులను అందించి ప్రజల ఆరోగ్యానికి భరోసాగా నిలవాలని పెద్ద కృషే చేస్తున్నారు. మన ప్రాంతంలో మంచి ఆహారం అందించేందుకు జరుగుతున్న కృషిపై ప్రత్యేక కథనం.



కాలబట్టి వరి ధాన్యం

నవారా ధాన్యం

కృషీవలుడు జిత్తుగ శ్రీనివాస్

పి.గన్నవరం (ఆంధ్రజ్యోతి) : అధిక దిగుబడుల కోసం రైతులు హైబ్రీడ్ రకాలతోనే వరిసాగు చేస్తున్నారు. ఈ రకాల సాగులో ఎరువులు, పురుగుమందులు విచ్చలవిడిగా వాడేస్తున్నారు. హైబ్రిడ్ రకాల బియ్యం తింటే ఆ ప్రభావం ఆరోగ్యంపై పడుతోంది. ఇలా అందరూ ఆధునిక సాగు పద్ధతులను అనుసరిస్తుంటే.. ఓ యువ కౌలురైతు మాత్రం పురాతన కాలంనాటి దేశవాళీ వంగడాలను సాగులోకి తెస్తున్నారు. గత ఏడేళ్లుగా ఈయన కృషి సాగిస్తూ వస్తున్నారు. డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ కోనసీమ జిల్లా పిగన్నవరం మండలం పోతవరం గ్రామానికి చెందిన యువ కౌలురైతు జిత్తుగ శ్రీనివాస్. 2012 నుంచి 2017 వరకు ఎక్కువ శాతం సేంద్రియ ఎరువులు, వర్మికంపోస్టు యూనిట్, జీవన ఎరువులు, వేపపిండి, వేపనూనె తదతర ఉత్పత్తులతో వరిలో హైబ్రిడ్ రకాలను పండించేవారు. 2017లో అప్పటి ప్రభుత్వం అమరావతిలో ఏర్పాటుచేసిన పాలేకర్ ఇచ్చిన శిక్షణలో పాల్గొని అప్పటి నుంచి ఏటా పలు దేశవాళి రకాలను పరిచయం చేస్తూ వస్తున్నాడు. ఇప్పటివరకు పది దేశవాళి రకాలతోపాటు రెండు హైబ్రిడ్ రకాలను ఈ పద్ధతుల్లోనే పండించారు. మొదటి ఏడాది ఒక ఎకరం పొలంలో ఐదు నుంచి ఆరు రకాలను పండించేవారు. క్రమేణా పది సెంట్ల పొలాన్ని ఎంచుకుని రెండు నుంచి మూడు రకాలను మాత్రమే పండిస్తున్నారు. పండించిన ధాన్యాన్ని మొదట్లో గిట్టుబాటు ధరకు అందించేవారు. కొంతకాలం తరువాత తన అవసరాలకు ఉపయోగించుకుని అనంతరం బంధువులకు పంచుతున్నారు. ఇప్పటివరకు ఆయన పండించిన వరి దేశవాళీ రకాలు.. కాలబట్టి, దూదేశ్వర్, ఇల్లపూసాంబ, తులసి భాసో, మైసూర్ మల్లిగా, కుళ్ళాకార్, చిట్టిముత్యాలు, నవారా నల్లబియ్యం.



ప్రకృతి సాగులో పొలం గట్లపై అరటి, కొబ్బరి చెట్ల పెంపకం.. (పక్కన) ప్రకృతి సహజ సాగు కోసం జీవామృతం తయారీ

ప్రకృతి సాగుతో సురక్షిత ఆహారం

ఆ దిశగా అడుగులు వేస్తున్న ఆదివాసీ రైతులు... 11 వేల ఎకరాల్లో సాగు

చింతూరు (ఆంధ్రజ్యోతి) : కాంప్లెక్స్ ఎరువులు, క్రిమిసంహారక మందుల వినియోగంతో భూసారం నానాటికి క్షీణిస్తోంది. అదే దశలో మానవాళి ఆరోగ్యంపై తీవ్ర ప్రభావం పడుతోంది. వివిధ రుగ్మతలకు రసాయనిక ఎరువులతో పండించిన పంటలే కారణమని వైద్యులు సైతం హెచ్చరిస్తుంటారు. దీంతో వ్యవసాయశాఖ ఆధ్వర్యంలోని రైతు సాధికారిత సంస్థ ప్రకృతి సాగుపై దృష్టి సారించింది. ఆ దిశగా రైతుకు అవగాహన కల్పిస్తోంది. ఇందులో భాగంగా ఒక్క చింతూరు డివిజనులోనే 8500 మంది ఆదివాసీ రైతులు 11 వేల ఎకరాల్లో ప్రకృతి సాగుకు ఈ ఏడాది శ్రీకారం చుట్టారు. వీటిలో వరితోపాటు కూరగాయలు, అపరాల సాగు కూడా ఉన్నాయి. ప్రకృతి వ్యవసాయం వైపు అడుగులు వేస్తున్న రైతులు వారే స్వయంగా సేంద్రియ ఎరువులను అతి తక్కువ ఖర్చుతో తయారు చేసుకుంటున్నారు. వీటిలో భూసారం పెంచే ఎరువుతోపాటు పురుగు నివారణ, అధిక దిగుబడి సాధించే ఎరువులు సైతం ఉన్నాయి. విత్తన శుద్ధికోసం బీజామృతం, పంట ఎదుగుదల, అధిక దిగుబడి, పురుగు నివారణ కోసం ఘనజీవామృతం, ద్రవజీవామృతం, నీమాస్త్రం వంటి కషాయాలను రైతు ఇంటి వద్దనే తయారు చేసుకుంటున్నారు. సేంద్రియ ఎరువు తయారు చేసుకోనేందుకు సెనగపిండి, ఎల్లుల్లి, మిర్చి, బెల్లం, పుట్టమట్టి, ఆవు మలమూత్రాలను వినియోగిస్తున్నారు. ఇవన్నీ తక్కువ వ్యయంతోపాటు అందుబాటులో లభ్యమయ్యేవే. మరోవైపు రోజురోజుకి పెరుగుతున్న సాగు వ్యయం రైతుని ఉక్కిరిబిక్కిరి చేస్తోంది. కూలీల కొరత వ్యవసాయానికి పెద్ద లోటుగా మారింది. దీంతో అధిక దిగుబడులు సాధిస్తే గాని రైతు గట్టెక్కలేని పరిస్థితి ఉంది. లేదంటే అప్పుల ఊబిలో కూరుకపోక తప్పదు. చేసేదేమి లేక నష్ట నివారణలో భాగంగా హైబ్రిడ్ వంగడాలు, కాంప్లెక్స్ ఎరువులు, క్రిమి సంహారక మందుల వినియోగం వైపు రైతు మళ్లాల్సి వస్తోంది. అయితే ఈ తరహా సాగు మానవాళి ఆరోగ్యంపై పడుతోంది. దీంతో ప్రభుత్వం ప్రకృతి సాగు దిశగా రైతులను మళ్లిస్తోంది.

ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరిన్ని రకాలు పండిస్తా

ప్రభుత్వం ప్రోత్సాహం అందిస్తే మరిన్ని రకాలు పండిస్తాను. ఇప్పటివరకు 10 దేశవాళీ, రెండు హైబ్రిడ్ రకాలు ప్రకృతి సేద్యం పద్ధతిలో పండించాను. వరిలో ప్రపంచంలో 10 వేల దేశవాళీ రకాలు ఉంటే వివిధ రాష్ట్రాల్లో 120 రకాలు వరకు పండిస్తున్నారని తెలుసుకున్నాను. ఈ రకాలన్నీ ప్రస్తుతం ఉత్పన్నమవుతున్న ఆరోగ్య సమస్యలను కట్టడి చేస్తాయి. అయితే ఈ రకాలపై సరైన అవగహన లేక మార్కెట్‌లో డిమాండ్ లేదు. ప్రభుత్వం రాయితీలిచ్చి ప్రోత్సహిస్తే పంటలు పండించొచ్చు.

- జిత్తుగ శ్రీనివాస్, కౌలురైతు, పోతవరం



చిరుధాన్యాలతోనే జీవనం!

పోడు భూముల్లో చిరుధాన్యాలు పండిస్తున్న కొండరెడ్లు




చింతూరు మండలం రత్నాపురంలో లైన్ షోయింగ్ పద్ధతిన వరి సాగులో కలుపు నివారణ చర్యలు



అడవుల్లో పండిస్తున్న జొన్న పంట

కూనవరం (ఆంధ్రజ్యోతి): కొండరెడ్లు... బాహ్య ప్రపంచానికి ఎక్కడో దూరంగా ఉండి జీవిస్తుంటారు. అడవుల్లో తలదాచుకునే వీరు పోడు భూమి వ్యవసాయం మీదే ఆధారపడి జీవనం సాగిస్తారు. వీరి ముఖ్య పంట చిరుధాన్యాలు. కూనవరం మండలంలోని గుట్టలపై కారుమానుకొండ, గబ్బిలాల గొంది, కోపిరిమెట్ట, బావిబొక్క, ఎరుగుమామిడిగొంది తదితర గ్రామాల కొండరెడ్ల ప్రజలు నివాసముంటున్నారు. వారు అక్కడ గుట్టలపై భూములు చదును చేసుకుని పంటలు పండిస్తారు. జొన్న, సాములు, కొర్రలు వీరి ముఖ్య పంటలు. ఈ పంటలను వర్షాధారం మీదే సాగు చేస్తారు. పండించిన పంటల్లో ఎటువంటి క్రిమిసంహారక మందులు వాడరు. పండిన చిరుధాన్యాల పంటలను తమ కుటుంబ పోషణకు కొద్దిగా ఉంచుకుని మరికొంత చిరుధాన్యాలను సంతల్లో అమ్ముకుంటున్నారు.



జేఎన్‌టీయూకేలో ఫుడ్ టెస్టింగ్ లేబొరేటరీ

తిండి కూడా తెలుసుకోవాల్సిందే

● 2014లో జేఎన్టీయూకేలో ఫుడ్‌టెస్టింగ్ లేబొరేటరీ ఏర్పాటు

● ఆహార పదార్థాల నాణ్యతా పరీక్షలకు రాష్ట్రంలో ఇదొక్కటే కేంద్రం

జేఎన్టీయూకే (ఆంధ్రజ్యోతి) : ప్రస్తుతం ప్రతీ ఒక్కరిలో తినే ఆహార పదార్థాల నాణ్యతపై శ్రద్ధ పెరిగింది. ముఖ్యంగా ఆహార నాణ్యతపై అవగాహనతోపాటు వాటి ప్రమాణాలను తెలుసుకునేందుకు ప్రజలు ఆసక్తి చూపుతున్నారు. దీనికోసం దేశంలో 232 ఫుడ్‌టెస్టింగ్ లేబొరేటరీలుండగా ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌లో ఏడు ఉండేవి. అయితే తెలంగాణ విడిపోయిన తరువాత విభజిత ఏపీలో ఒక్క ల్యాబ్ కూడా లేకపోవడంతో కాకినాడ జేఎన్టీయూకేలో 2014లో ఫుడ్‌టెస్టింగ్ లేబొరేటరీని ఏర్పాటుచేశారు. ఆహార ఉత్పత్తుల పరీక్ష అనేది చాలా ముఖ్యం. దీనివల్ల ఎఫ్ఎస్ఎస్ఏఐ నిర్దేశించిన నాణ్యతా ప్రమాణాలు కచ్చితంగా పర్యవేక్షించబడతాయి. ఆహారంలో భౌతిక, రసాయనిక, జీవసంబంధమైన ప్రమాదాలు లేవని నిర్ధారించడానికి ఈ పరీక్ష అవసరం. అంతేకాకుండా ఆహారంలోని శాస్త్రీయ విశ్లేషణను తెలియజేస్తుంది. కంటికి కనిపించని లోహాలు, ఎశ్చరీషియా కోలై బ్యాక్టీరియా, సాల్మోనెల్లా, క్లీనింగ్ ఏజెంట్లు, సంకలనాలు, పురుగు మందులు వంటి వాటిని ఈ పరీక్షల ద్వారా తెలుసుకునే అవకాశం ఉంటుంది. రోజురోజుకు పెరుగుతున్న మానవ వనరుల ఆవశ్యకతను గుర్తించి జేఎన్టీయూకేలో విశ్రాంత ప్రొఫెసర్ పి.రామకృష్ణ సూచనలు, సలహాలతో 2010-11లో స్కూల్ ఆఫ్ ఫుడ్ టెక్నాలజీని ప్రారంభించి ఫుడ్‌ప్రాసెసింగ్ టెక్నాలజీలో రెండేళ్ల కాల వ్యవధి గల ఎంటెక్ కోర్సును ప్రవేశపెట్టారు. అదేవిధంగా 2020-21లో ఫుడ్ ఇంజనీరింగ్‌లో బీటెక్ కోర్సును ప్రారంభించారు. 2014లో ఐదుగురు సభ్యులతో పరీక్ష శాలను ఏర్పాటుచేయగా దేశంలో ఎఫ్ఎస్ఎస్ఏఐ అర్హత కలిగిన ఆహార విశ్లేషకులు 132 మంది ఉండగా రాష్ట్రంలో ఏడుగురు మాత్రమే ఉన్నారు. వారిలో కె.విజయలక్ష్మి, మరో ఐదుగురు ల్యాబ్ సైంటిస్టులు ఇక్కడ సేవలందిస్తున్నారు. ఎగుమతి తనిఖీమండలి(ఈఐసీ), అగ్రికల్చర్ ప్రొడ్యూస్ ఎక్స్‌పోర్ట్ డవలప్‌మెంట్ అథారిటీ నుంచి గుర్తింపు పొందిన తరువాత సీఫుడ్, పండ్లు, కూరగాయలు, సుగంధ ద్రవ్యాలు, తృణధాన్యాలు, పప్పులు, హెవీ మెటల్స్‌లోని యాంటీబయాటిక్స్‌ను పరీక్షించే అవకాశముందని స్కూల్ ఆఫ్ ఫుడ్‌టెక్నాలజీ విభాగాధిపతి డాక్టర్ మాలోతు రమేష్ తెలిపారు. అదేవిధంగా దిగుమతి చేసుకున్న నూనెలను కస్టమ్స్ డిపార్ట్‌మెంట్ నుంచి నాణ్యతను విశ్లేషించడానికి తమకు వస్తున్నాయని ఎఫ్ఎస్ఎస్ఏఐ అధికారులు లైసెన్స్ జారీ చేసే ముందు ఆహార నమూనాలను విశ్లేషణ కోసం పంపిస్తే వాటిని పరీక్షిస్తామన్నారు. 2014 నుంచి ఇప్పటివరకూ సుమారు 4200 పరీక్షలు నిర్వహించి ఆమోదాన్ని తెలిపామన్నారు.



డాక్టర్ మాలోతు రమేష్

ఎవరైనా పరీక్ష చేయించుకోవచ్చా..

వర్సిటీలో ఏర్పాటుచేసిన ఫుడ్‌టెస్టింగ్ ల్యాబ్‌లో ప్రజలు సైతం నామమాత్రపు రుసుం నిబంధనల ప్రకారం చెల్లించి తమకు సందేహాలున్న వాటిని తనిఖీ చేయించుకునే అవకాశముంది. పిల్లలు తాగేపాలు, మంచినీటి దగ్గర నుంచి నెయ్యి, వంట నూనె, తినే కూరగాయలు, వాటిని పండించేందుకు వాడే రసాయనాలు, క్రిమిసంహారక మందులు ఇలా అన్నింటినీ తనిఖీచేసి వాటి నాణ్యతా ప్రమాణాలను తెలుసుకునే అవకాశముంది. ఏపీలో ఏకైక ఎఫ్ఎస్ఎస్ఏఐ ఫాస్టాక్ ట్రైనింగ్ పార్టనర్‌గా గుర్తింపు పొందిన సంస్థ జేఎన్టీయూకే అని డాక్టర్ మాలోతు రమేష్ తెలిపారు.



కాదేదీ కల్తీకనర్హం

రాజమహేంద్రవరం (ఆంధ్రజ్యోతి): అన్ని చోట్లా ఆహారం, ఆహార దినుసులు కల్తీ అవుతూనే ఉన్నాయి. ఫస్ట్ క్వాలిటీ, సెకండ్, థర్డ్ క్వాలిటీ అనే పదాలు ఎప్పుడో పుట్టుకొచ్చేశాయి. అయితే ఆహార భద్రత అధికారులు ఎప్పటికప్పుడు తనిఖీలు చేస్తూనే ఉన్నా.. పూర్తిగా రోజూ పరిశీలించడం సాధ్యమయ్యే పనికాదు. తూర్పుగోదావరి జిల్లాలో ఈ ఏడాది ఇప్పటివరకూ హోటల్స్, రెస్టారెంట్లు, బార్లు, కిరాణా, ఐస్‌క్రీం ఫ్యాక్టరీలు తదితర చోట్ల 123 నమూనాలను సేకరించారు. వాటిని నాచారంలోని స్టేట్ ఫుడ్ ల్యాబ్‌కి పంపించారు. వాటిలో 39 నమూనాలు పరీక్షలో విఫలమయ్యాయి. నాణ్యత లేకపోవడం, బ్రాండ్ పేరు సరిగా లేకపోవడం, వంటనూనె ప్రమాణాల్లో బేధాలు, గడువు ముగిసిన వాటిని విక్రయిస్తుండడం వంటివి వాటిలో ఉన్నాయి. వీటి ఆధారంగా కేసులు నమోదు చేయనున్నారు. ఇక ఆహార పదార్థాల విషయంలో ఏదైనా ఫిర్యాదు చేయాలంటే ఎవరికి చేయాలో తెలియని పరిస్థితి ఉంది. గతంలో ఉమ్మడి జిల్లాలో ఒక ఫోన్ నంబరు ఉండేది. కానీ ఇప్పుడు అది పనిచేయడం లేదు. ఎఫ్ఎస్ఎస్ఏఐ వెబ్‌సైట్‌కు వెళ్లి ఫిర్యాదు చేసుకోవాల్సిందే. అలాకాకుండా ప్రతి చోటా సంబంధిత అధికారుల ఫోన్ నంబర్లు డిస్‌ప్లే చేయాలని వినియోగదారులు కోరుతున్నారు. దైనందిన జీవనంలో రోజు వారీగా కొన్ని ఆహార పదార్థాలు వంటల్లో ఉండాల్సిందే. కానీ అన్నీ కల్తీనే. కందిపప్పులో కేసరి పప్పు, ధనియాల పొడిలో ఉప్పు, పసుపులో లెడ్‌క్రోమెట్ మిళాయి రంగు, నూనెల్లో ఆముదం, ఆవ నూనెలో ఆర్జిమోన్ నూనె, గసగసాల్లో తోటకూర గింజలు, పాలల్లో బియ్యపు పిండి వంటివి కలిపేస్తున్నారు. వీటివల్ల ఆర్థిక నష్టమే కాకుండా అనేక అనారోగ్య సమస్యలు వస్తాయని వైద్య నిపుణులు హెచ్చరిస్తున్నారు.

తనిఖీల కోసం మూడు బృందాలు

రాజమహేంద్రవరం సిటీ (ఆంధ్రజ్యోతి): మనిషి సంపూర్ణ ఆరోగ్యానికి ముఖ్యమైనది నాణ్యమైన ఆహారం. రాజమహేంద్రవరంలో ప్రజలకు, పర్యాటకులకు నాణ్యమైన ఆహారాన్ని అందించేలా హోటల్స్, రెస్టారెంట్లను అప్రమత్తం చేసేందుకు నగరపాలక సంస్థ కసరత్తు చేస్తోంది. చారిత్రక రాజమహేంద్రవరం కీర్తికి ఎటువంటి మరక అంటకూడదనే ఆలోచనతో కమిషనర్ కేతన్‌గార్గ్ నగరంలో పబ్లిక్ హెల్త్‌విభాగం నుంచి మూడు ఫుడ్ సేఫ్టీ బృందాలను ఏర్పాటుచేశారు. గతంలో నగరంలో ఆహార నాణ్యత విషయంలో సమస్యలు ఉండేవి. ఇటీవల కార్పొరేషన్ ఫుడ్ సేఫ్టీ బృందాల తనిఖీలు ముమ్మరం చేయడంతో పరిస్థితిలో మార్పు వచ్చింది. హోటళ్ల, రెస్టారెంట్లలో వంటశాలలను తనిఖీలు చేసి అక్కడ వినియోగించే పరికరాలు, ఆహార తయారీకి వినియోగించే సరుకులు, నిల్వచేసిన ఆహారాలపై తరచు తనిఖీలు చేస్తున్నారు.

ఇన్‌స్టా గ్రామ్‌లో నకిలీ యాప్.. రూ.28.30 లక్షలకు టోకరా!

ట్రేడింగ్ పేరుతో సైబర్ వల

మోసపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్

కొవ్వూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాగ్రామ్‌లో మోసపూరిత యాప్‌తో సైబర్ నేరగాళ్లు ఒక వ్యక్తి నుంచి రూ.28.30 లక్షలు కాజేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పట్టణానికి చెందిన జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ కండాల వెంకట ద్వారకా శ్రీనివాస్ షేర్స్ వ్యాపారం చేస్తుంటారు. దీనిలో భాగంగా ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో మోతీలాల్ ఆశ్వాల్ ఇనిస్టిట్యూషనల్ అకౌంట్ యాప్‌నకు కస్టమర్ కేర్ సూచనల మేర కు నాలుగు అకౌంట్స్‌కి దఫదఫాలుగా రూ. 28.30 లక్షలు చెల్లించారు. శ్రీనివాస్ తన పేరు మీద షేర్స్‌లో ఉన్న సొమ్ము విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నం చేశాడు. అయితే షేర్స్‌లో ఉన్న సొమ్ము తన అకౌంట్‌కి బదిలీ కాకపోవడంతో రాజమహేంద్రవరం వెళ్లి మోతీలాల్ ఆశ్వాల్ ట్రేడింగ్ కంపెనీ ప్రతినిధులను సంప్రదించాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో యాప్‌కి తమకు సంభందం లేదని, తమకు ఏ విధమైన యాప్‌లు లేవని, థర్డ్ పార్టీ అకౌంట్స్‌కి సొమ్ము పంపించడం ఉండదని ట్రేడింగ్ కంపెనీ ప్రతినిదులు తెలియజేశారు. దీంతో శ్రీనివాస్ మోసపోయినట్టు తెలుసుకుని లబోదిబోమన్నాడు. ఈ మేరకు మం గళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

నాణ్యమైన ఆహారం అందివ్వాలనే ఉద్దేశంతో..

పెరవలి (ఆంధ్రజ్యోతి) : తమ కుటుంబంతోపాటు గ్రామస్తులకు కూడా ఎటువంటి పురుగు మందులు అవశేషాలు లేని నాణ్యమైన ఆహార ధాన్యాలు అందించాలనే ఉద్దేశంతో పెరవలి మండలం తీపర్రుకు చెందిన అభ్యుదయ రైతు కంటిపూడి సూర్యనారాయణ గత పదేళ్ల నుంచి ప్రకృతి వ్యవసాయం బాట పట్టారు. తనకున్న రెండు ఎకరాల భూమిలో ఎటువంటి ఎరువులు పురుగు మందులు వాడకుండా ఉన్నారు. ఆకుమడి లగాయతు కోత కోసే వరకు కేవలం వివిధ రకాల ఆకుల కషాయం, పశువుల పేడ, ఆవు మూత్రంతో తయారుచేసిన వివిధ రకాల ద్రవాలను పంటలపై వెదజల్లుతూ భూమిపై వేస్తూ వరిని సాగు చేస్తున్నారు. ఎకరానికి 25 బస్తాలు వరకు దిగుడి వస్తోందన్నారు. తానే సొంతంగా మిల్లులకు తీసుకెళ్లి వాటిని మర ఆడించి 25 కిలోల బస్తాలుగా ప్యాక్ చేయించి తక్కువ ధరకే స్థానిక ప్రజలకు విక్రయిస్తున్నట్టు పేర్కొన్నారు. గతంలో 25 కిలోల బియ్యం బస్తా 1300 అమ్మేవాడినని, ప్రస్తుతం గిట్టుబాటు కాకపోవడంతో 1500 విక్రయిస్తున్నట్టు చెప్పారు. వరి కోసిన అనంతరం ఇదే భూమిలో కూరగాయలు కూడా పండిస్తానని తెలిపారు. ఇదే తరహా పంటలనే పండించాలని అనుకున్నట్టు చెప్పారు.



రాజమహేంద్రవరంలో జరిగిన సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి అచ్చెన్నాయుడు, చిత్రంలో మంత్రులు, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు

రాష్ట్రానికి ఊపిరిపోశాం!

120 రోజుల్లో ఆక్సిజన్ అందించాం

జగన్ రాజకీయాలకు అనర్హుడు

రాష్ట్ర మంత్రి అచ్చెన్నాయుడు

రాజమహేంద్రవరం,అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): 'చంద్రబాబు నాయకత్వంలోని కూటమి ప్రభుత్వం సుమారు 120 రోజుల్లో ఏమి చేసిందో నాకు తెలుసు. 5 కోట్ల ఆంధ్రులకూ తెలుసు. కొందరు ఏమి చేశారని బురద చల్లే ప్రయత్నం చేస్తున్నారు. మేము అధికారంలోకి వచ్చేసరికి ప్రభుత్వం వెంటిలేటర్ మీద ఉంది. అటువంటి పరిస్థితి నుంచి ప్రభుత్వాన్ని ఇప్పటికే ఆక్సిజన్ పీల్చుకునే స్థాయికి తీసుకొచ్చాం' అని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్, పశు సంవర్ధక, డెయిరీ డెవలప్‌మెంట్ అండ్ మత్స్య శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు అన్నారు. తూర్పుగోదావరి రాజమహేంద్రవరంలోని మంజీరా ఇంటర్నేషనల్ హోటల్‌లో మంగళవారం ఆయన విలేకరులతో మాట్లాడారు. వైసీసీ ఐదేళ్ల పాలనలో వ్యవస్థలన్నీ సర్వనాశనమయ్యాయని, ఆర్థిక వ్యవస్థ కుప్పకూలిపోయిందన్నారు. ప్రకృతి సంపదను జగన్ దోచేసుకున్నాడని ధ్వజమెత్తారు. ఇటువంటి పరిస్థితుల్లో ఆంధ్రులు జగన్‌ని తరిమికొట్టి కూటమిని గెలిపించారన్నారు. ఈ 120 రోజుల్లో రూ.3 వేల పింఛన్‌ను రూ.4వేలు చేశామని, 150 అన్న క్యాంటీన్లు ఏర్పాటు చేశామని, 16,700 మంది టీచర్ ఉద్యోగాలు పొందే అవకాశం కల్పించామని, రైతులను వేధించిన భూహక్కు చట్టం రద్దు చేశామని మంత్రి పేర్కొన్నారు. 2027 నాటికి పోలవరం పూర్తి చేయనున్నామని ఆయన తెలిపారు. నవంబరు నుంచి రాజధాని నిర్మాణం శరవేగంగా సాగనుంది. రాష్ట్రంలో అధ్వానంగా మారిన రోడ్లను సరి చేయడం కోసం రూ.400 కోట్లతో టెండర్లు ఖరారు చేశాం. మొదటి దశలో గోతులు పూడుస్తాం. రెండో దశలో పీపీపీ పద్ధతిలో రోడ్లు నిర్మిస్తామని చెప్పారు. వైసీపీ లిక్కర్ పాలసీపై పిచ్చికుక్కలా మాట్లాడుతోంది. ఐదేళ్ల పాటు లిక్కర్‌కు జగన్ సొంత పాలసీ తెచ్చాడు. తానే తయారు చేసి, తానే అమ్మి, తానే రవాణా చేసి, రూ.40 వేల కోట్లు దోచుకున్నాడు. పైగా నాసిరకం లిక్కరుతో ప్రజల ప్రాణాలతో చెలగాట మాడాడు. ఇవాళ కూటమి మంచి లిక్కర్ పాలసీ తెచ్చింది. పారదర్శకంగా ప్రజల ముంగిట లాటరీ తీసి దుకాణాలు అప్పగించిందన్నారు. బుధవారం నుంచి రాష్ట్రంలో 40 రీచ్‌ల నుంచి ఇసుక తవ్వుతున్నాం. అందరికీ అందుబాటులో ఇసుక ఉంటుందన్నారు. కాగా ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ గాడిలో పెట్టారని మంత్రి కందుల దుర్గేష్ అన్నారు.

నన్నయలో పీజీ ప్రవేశాలకు 17న స్పాట్ కౌన్సెలింగ్

● ఉపకులపతి శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, అక్టోబరు 15: ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం 2024-25 విద్యాసంవత్సరానికి సంబంధించిన ఎంఏ, ఎం.కాం, ఎంపీఈడీ, ఎంఎస్సీ కోర్సుల్లోని భర్తీ చేయని సీట్లకు ఈనెల 17న స్పాట్ కౌన్సెలింగ్ నిర్వహిస్తున్నామని ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు మంగళవారం తెలిపారు. ఏపీ పీజీ సెట్‌లో అర్హత సాధించిన అభ్యర్థులు మాత్రమే స్పాట్ కౌన్సెలింగ్‌కు హాజరుకావాలన్నారు. నన్నయ రాజమహేంద్రవరం, కాకినాడ, తాడేపల్లిగూడెం ప్రాంగణాల్లో సంబంధిత సీట్ల భర్తీకి కౌన్సెలింగ్ జరుగుతుందన్నారు. విశ్వవిద్యాలయంలోని డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ కార్యాలయంలో కౌన్సెలింగ్ ప్రక్రియ నిర్వహిస్తారన్నారు. అభ్యర్థులు 17వ తేదీ ఉదయం 9.30నుంచి 11 గంటలలోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. కౌన్సెలింగ్ ప్రక్రియను డైరెక్టర్ ఆఫ్ అడ్మిషన్స్ ఆచార్య డి.జ్యోతిర్మయి పర్యవేక్షిస్తారని అన్నారు. సీట్లు, ఫీజు వివరాలను విశ్వవిద్యాలయం వెబ్‌సైట్ ద్వారా పొందవచ్చునని తెలిపారు.



పెద్ద పులి అడుగుజాడలు

కూనవరంలో పెద్ద పులి సంచారం

కూనవరం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి) : అల్లూరి జిల్లా కూనవరం మండలంలో పెద్దపులి సంచరిస్తున్నట్లు అటవీశాఖాధికారులు గుర్తించారు. ఈమేరకు పులి అడుగుజాడలు పరిశీలించారు. కూనవరం రేంజ్ పరిధిలో పోచవరం కాలనీవద్ద ఈ పెద్దపులి అడుగుజాడలు గుర్తించినట్లు ఫారెస్ట్ రేంజ్ ఆఫీసర్ కరుణాకర్ తెలిపారు. ఇది వయస్సు ఎక్కువ గల పెద్ద పులి అని పాదముద్రలు గుర్తించినట్లు తెలిపారు. ఈపులి ఛత్తీస్‌గఢ్ అడవుల నుంచి గానీ, పాపికొండల అభయారణ్యం నుంచి గానీ వచ్చినట్లు ఆయన అన్నారు. పులిజాడ కోసం అడవిలో పది ట్రాప్ కెమెరాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఆ పులి జంతువులు, మరెవరికీ గాని హాని తలపెట్టలేదన్నారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు పులి జాడ కోసం 30 మంది అటవీ సిబ్బందిని నియమించినట్లు ఆయన తెలిపారు.

లారీ ఢీకొని ఉపాధ్యాయుడి మృతి



కొనకళ్ళ గణేష్ కుమార్

గోపాలపురం, అక్టోబరు 15: ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో కొనకళ్ళ గణేష్ కుమార్ అనే ఉపాధ్యాయుడు తీవ్రగాయాల పాలై మృతి చెందిన సంఘటన తూర్పుగోదావరిజిల్లా గోపాలపురం గ్రామశివారులో మంగళ వారం చోటుచేసుకుంది. ఎస్‌ఐ కె. సతీష్ కుమార్ తెలిపిన వివరాల ప్రకారం కొనకళ్ళ గణేష్ కుమార్ అనే వ్యక్తి నిడదవోలు మండ లం బ్రహ్మణగూడెంలో ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ శమిస్రగూడెంలో నివాసం ఉంటున్నాడని తెలిపారు. మంగళవారం సెలవు పెట్టి స్వగ్రామం అయిన బొర్రంపాలెం వె ళ్తుండగా గోపాలపురం గ్రామశివారులో ద్విచక్రవాహనంపై వెళుతున్న గణేష్‌కుమార్‌ను ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో గణేష్ కుమార్‌కు తీవ్ర గాయాలయ్యాయని అన్నారు. గాయాలపాలైన గణేష్‌కుమార్ ప్రథమ చికిత్సకోసంగోపాలపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించారు. అనంతరం మెరుగైన వైద్యంకోసం రాజమండ్రిలోని బొల్లినేని ఆసుపత్రికి తీసుకెళ్తుండగా మార్గమధ్యంలో మృతి చెందినట్లు ఎస్‌ఐ తెలిపారు. అతని భార్య కొనకళ్ల బేబీ ఆదిలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.





రాజమహేంద్రవరంలో జరిగిన ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ రౌండ్‌టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్, చిత్రంలో మంత్రులు అచ్చెన్నాయుడు, దుర్గేష్, రామానాయుడు, ఎమ్మెల్యేలు

కూటమిగా పనిచేద్దాం.. ఎమ్మెల్సీని గెలిపిద్దాం

అభ్యర్థిని ప్రకటించేలోపు.. గ్రాడ్యుయేట్ ఓటర్లను చేర్పిద్దాం

రాజమహేంద్రవరంలో రౌండ్‌టేబుల్ సమావేశం

మంత్రులు, ఎమ్మెల్యేలు,ఎమ్మెల్సీలు, పార్టీనేతల స్పష్టీకరణ

రాజమహేంద్రవరం, అక్టోబరు15 (ఆంధ్రజ్యోతి): వచ్చే ఏడాది మార్చి, ఏప్రిల్ నెలల్లోపు జరిగే ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గం ఎమ్మెల్సీ స్థానాన్ని కూటమిగా పనిచేసి గెలిపిద్దామని కూటమి నేతలు ప్రతినబూనారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల నియోజకవర్గ ఎమ్మెల్సీ ఎన్నిక నేపథ్యంలో తూర్పుగోదావరిజిల్లా రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు పర్యవేక్షణలో మంజీరా ఇంటర్నేషనల్ హోటల్‌లో మంగళవారం జరిగిన రౌండ్‌టేబుల్ సమావేశంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాస్ మాట్లాడారు. పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు సన్నాహక సమావేశంగా ఇది నిర్వహిస్తున్నామన్నారు. ఈ ఎన్నికలో కూటమి అభ్యర్థి గెలవడానికి అందరి సహకారం కావాలన్నారు. అభ్యర్థిని అధినాయకత్వం ప్రకటిస్తుందని తెలిపారు. గ్రాడ్యుయేట్లు అందరినీ నవంబరు 6వ తేదీలోపు ఓటర్లుగా నమోదు చేయించాలన్నారు. రేపటి నుంచే నమోదు కార్యక్రమం మొదలు పెట్టాలని స్పష్టం చేశారు. రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో గోదావరిజిల్లాల ప్రజలు 34 ఎమ్మెల్యేలు, 5 ఎంపీ స్థానాలను ఇచ్చారు. మన ప్రభుత్వం ఏర్పడిన తర్వాత ఈ ఎమ్మెల్సీ ఎన్నికలే మొదటి ఎన్నికలు. ఇది మనకు నల్లేరుమీద నడకే అన్నారు. కానీ అభ్యర్థిని కూడా త్వరగా ఎంపిక చేసేలా అధిష్ఠానంతో మాట్లాడదామన్నారు. గత ఎమ్మెల్సీ ఎన్నికల ఓటర్ల జాబితాతో సంబంధంలేదు మళ్లీ చేర్పించాలన్నారు. రాష్ట్ర పర్యాటకశాఖ మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ సార్వత్రిక ఎన్నికల్లో కూటమి విజయస్ఫూర్తిని ఎమ్మెల్సీ ఎన్నికలో కూడా కొనసాగించాలన్నారు. మేమంతా ఐక్యంగా పనిచేసి, అభ్యర్థి ఎవరైనా సరే గెలిపిస్తామని చెప్పారు. వైసీపీ పోటీ చేయలేమనే పరిస్థితి ఏర్పడుతుందని వివరించారు. రాష్ట్ర జలవనరులశాఖ మంత్రి నిమ్మల రామానాయుడు మాట్లాడుతూ గతంలో వైసీపీ అధికారంలో ఉండగానే విద్యావంతులైన పట్టభద్రులు మూడు ఎమ్మెల్సీ స్థానాలను టీడీపీకి ఇచ్చారని, ఇక్కడ గెలిచి అదేచరిత్రను కొనసా గించాలన్నారు. బూత్‌స్థాయి నుంచి కమిటీలు వేసి అందరినీ భాగస్వాములను చేయాలని చెప్పారు. మంత్రి వాసంశెట్టి సుభాష్ మాట్లాడుతూ కలసి పనిచేసి ఎమ్మెల్సీ అభ్యర్థిని గెలిపిద్దామన్నారు. మాజీ మంత్రి, ఎమ్మెల్యే పితాని సత్యనారాయణ మాట్లాడుతూ అందరం ఐక్యంగా అభ్యర్థిని గెలిపిద్దాం అన్నారు. ఎమ్మెల్యే ఆదిరెడ్డి వాసు మాట్లాడుతూ ఓటర్ల నమోదు చేయించేలోపు అభ్యర్థిని ప్రకటిస్తే మంచిదని సూచించారు. సమావేశంలో ఎమ్మెల్యేలు గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నల్లమిల్లి రామకృష్ణారెడ్డి, బత్తుల బలరామకృష్ణ, ముప్పిడి వేంకటేశ్వరరావు, చింతమనేని ప్రభాకర్, పంతం నానాజీ, సృజనారంగారావు, జనసేన ఎమ్మెల్సీ హరిప్రసాద్, మాజీ మంత్రి జవహర్, జ్యోతుల నవీన్, రెడ్డి సుబ్రహ్మణ్యం, అనంతలక్ష్మి, పిల్లి సత్యనారాయణ, అనంతలక్ష్మి, మాజీ ఎమ్మెల్యేలు మంతెన రామరాజు, బూరుగుపల్లి శేషారావు, బీఆర్ చౌదరి, ఆది రెడ్డి అప్పారావు, గన్ని కృష్ణ, తోట సుధీర్, అనుశ్రీ సత్యనారాయణ, యర్రా వేణుగోపాలరాయుడు, కాశి రాజు, సత్యనారాయణ, బొమ్ముల దత్తు, రంగబాబు పాల్గొన్నారు.

కోనపాపపేటలో చోరీ

● 15 కాసుల బంగారం, లక్ష నగదు అపహరించిన దొంగలు

కొత్తపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): ఇంట్లో ఎవరూ లేని సమయంలో చొరబడి బంగారం, నగదు చోరీకి గురైన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. బాధితులు కొత్తపల్లి పోలీసులకు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. కాకినాడజిల్లా కొత్తపల్లి మండలం పొన్నాడ శివారు కోనపాపపేటకు చెందిన చింతకాయల జగన్నాధం భవానీ మాల దీక్ష చేపట్టారు. దీక్ష పూర్తిచేసిన అనంతరం కనకదుర్గ మొక్కు చెల్లించుకొనే ందుకు కుటుంబ సభ్యులతో సోమవారం విజయవాడ వెళ్లారు. ఇదే అదునుగా భావించిన గుర్తు తెలియని దొంగలు జగన్నాధం ఇంట్లో చొరబడి బీరువా తాళాలు బద్దలు కొట్టి 15కాసుల బంగారు ఆభరణాలు, రూ.లక్ష నగదు దోచుకొనిపోయారు. జగన్నాధం విజయవాడ నుంచి ఇంటికి వచ్చేసరికి ఇంట్లో సామాన్లు చిందరవందరగా ఉండటంతో ఇనుప బీరువా తెరిచి చూసేసరికి బంగారం, నగదు కనిపించకపోవడంతో వెంటనే కొత్తప ల్లి పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో ఎస్‌ఐ పి.వెంకటేష్ సిబ్బందితో జగన్నాధం ఇంటి పరిసరాలను పరిశీలించారు. బాధితుని ఫిర్యాదు మేరకు కేసు నమోదుచేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు.

రైలు నుంచి జారి పడి మహిళ మృతి



తునిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రైలు నుంచి జారి పడి మహిళ మృతి చెందిన ఘటన కాకినాడ జిల్లా తుని రైల్వేస్టేషన్ శివారున జరిగింది. అన్నవరం నుంచి తుని వైపువస్తున్న గుర్తు తెలియని రైలులో ప్ర యాణం చేస్తూ ప్రమాదశాత్తూ జారిపడి ఉంటుందని రైల్వే పోలీసులు భావిస్తున్నా రు. మహిళ వయస్సు సుమారు 40 ఏళ్లు ఉంటుందని, పసుపు రంగు పువ్వులు గల డిజైన్‌తో ఉన్న పంజాబీ డ్రస్సు ధరించినట్లు రైల్వే పోలీసులు తెలిపారు. ఇంకా ఏ విధమైన ఆధారాలు లేకపోవడంతో కేసు నమో దు చేసి మృతదేహాన్ని ఏరియా ఆసుపత్రికి తరలించారు. మృతురాలి బంధువులు ఎవ రైనా ఉంటే తుని రైల్వేస్టేషన్‌లో కానీ, 9490619020లో సంప్రదించాలని కోరారు.

తునిలో కోనసీమ వాసి అనుమానాస్పద మృతి



తునిరూరల్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కోనసీమ జిల్లాకు చెందిన వ్యక్తి కాకినాడ జిల్లా తుని పట్టణంలో అనుమానాస్పదంగా మృతి చెందడం కలకలం రేపింది. తు ని పట్టణంలో వీరంకి వారి వీధిలో ఓ ఇంటి సందులో అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన వ్యక్తిని గమనించిన స్థానికులు పోలీసులకు సమాచారం అందించారు. దీం తో తుని పట్టణ పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడివద్ద లభించిన ఆధార్ కార్డు ఆధారంగా మృతుడు కాట్రేనికోన మండలం నడవపల్లి గ్రామానికి చెందిన అయితాబత్తుల రవికిరణ్(40)గా గుర్తించారు. ఈ ఘటనపై కేసు నమోదు చేసిన పోలీసులు మృతదేహాన్ని మార్చురీకి తరలించారు.

ప్రమాదశాత్తూ మత్స్యకారుడు మృతి

ఏలేశ్వరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడజిల్లా ఏలేశ్వరంలో ప్రమాదవశాత్తూ మత్స్యకారుడు మృతి చెందాడు.. మంగళవారం అప్పనపాలెం వద్ద చేపల వేటకు వెళ్లిన మత్స్యకారుడు మృతి చెందాడని ఏలేశ్వరం ఎస్‌ఐ రామలింగేశ్వరరావు తెలిపారు. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం... ట్యూబ్ సాయంతో చేపల వేటకు వెళ్లిన గేదే శ్రీను ప్రవాహ వేగానికి అదుపుతప్పి నీటిలో పడిపోయి అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి ఇద్దరు కుమారులు ఉన్నారు. భార్య కృష్ణవేణి ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేశారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం ఆసుపత్రికి తరలించారు.

పిఠాపురంలో పొట్టేల్ చిత్రం యూనిట్ సందడి



పిఠాపురం పాదగయ క్షేత్రంలో పొట్టేల్ చిత్రం హీరో, హీరోయిన్లు, యూనిట్ సభ్యులు

పాదగయ క్షేత్రంలో ప్రత్యేక పూజలు

అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుంది

పిఠాపురం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి):: పిఠాపురం పట్టణంలోని పాదగయ క్షేత్రాన్ని మంగళవారం పొట్టేల్ చిత్రం యూనిట్ సందర్శించింది. సినిమాలో హీరో, హీరోయిన్లుగా నటించిన యువ, అనన్య నాగళ్ల, ఆర్టిస్ట్ నోయల్, చిత్ర నిర్మాత నిషాంక్‌లు పాదగయలోని కుక్కుటేశ్వరస్వామి, దత్తాత్రేయస్వామి, రాజరాజేశ్వరీదేవి, పురుహూతికాఅమ్మవార్లను దర్శించుకుని పూజలు నిర్వహించారు. క్షేత్ర ప్రాశస్త్యం గురించి వేదపండితులు వివరించి ఆశీర్వచనాలు పలికారు. ఆల య అధికారులు వారిని శేషవస్త్రాలతో సత్కరించి ప్రసాదాలు అందజేశారు.

సందడి చేసిన యూనిట్

పొట్టేల్ చిత్రం యూనిట్ వచ్చిందన్న విషయం తెలుసుకున్న అభిమానులు భారీగా తరలివచ్చారు. వారితో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు. పలువురు అభిమానులతో వారు సెల్ఫీలు దిగారు. ఈ సందర్భంగా హీరో, హీరోయిన్లు యువ, అనన్యలు మాట్లాడుతూ డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్ నియోజకవర్గమైన పిఠాపురంలో పొట్టేల్ చిత్రం ప్రమోషన్ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు. గ్రామీణ నేపథ్యంలో సాగే ఈ సినిమా అన్నివర్గాల ప్రేక్షకులను ఆకట్టుకుంటుందని వారు తెలిపారు.





మెగాస్టార్ చిరంజీవిని కలిసిన చంటియ్య, డాక్టరేట్ అందుకుంటున్న చంటియ్య (పాతచిత్రాలు)

సత్యదేవా నర్సరీ అధినేత చంటియ్య మృతి



పుల్లా చంటియ్య (ఫైల్)

కడియం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): శ్రీసత్యదేవా నర్సరీ అధినేత, నర్సరీ సంఘం మాజీ అధ్యక్షుడు పుల్లా సత్యనారాయణ(చంటియ్య) (67) మంగళవారం తెల్లవారుజామున మృతి చెందారు. ఆయన కొంత కాలంగా అనారోగ్యంతో చికిత్స పొందుతున్నారు. చంటియ్యకు భార్య, కుమారుడు పెదసత్యనారాయణ, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. చంటియ్య ఆడంబరాలకు దూరంగా ఉండేవారు. కొత్త రకం మొక్కలు సేకరించడంలో ఆయనకు ఆయనే సాటి. ఆయన కొన్ని నెలల క్రితం గ్లోబల్ హ్యూమన్ పీస్ యూనివర్శిటీ నుంచి గౌరవ డాక్టరేట్ అందుకున్నారు. పలువురు ప్రముఖుల చేతుల మీదుగా అవార్డులు దక్కించుకున్నారు. కాగా తండ్రి పుల్లా వెంకట్రావు స్థాపించిన సత్యదేవా నర్సరీని చంటియ్య సోదరులు నాగేశ్వరరావు, అబ్బులు అభివృద్ధి చేశారు. చంటియ్య మృతితో మంగళవారం నర్సరీలు ఎగుమతులు, దిగుమతులు నిలిపివేసి సెలవు ప్రకటించారు. ఆయన మృతికి మంత్రి కందుల దుర్గేష్, ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి, నర్సరీ సంఘం అధ్యక్షుడు మల్లు పోలరాజు, డైరెకర్లు, మార్గాని సత్యనారాయణ, నర్సరీ రైతులు సంతాపం తెలిపారు.

ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలి

రాజమహేంద్రవరం రైల్వేస్టేషన్‌లో పీసీఎస్‌వో తనిఖీలు



ఆటోమేటిక్ ఇంటర్ లాకింగ్ పనితీరును పరిశీలిస్తున్న పీసీఎస్‌వో

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్న విషయంపై అలసత్వం వహించవద్దని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెఫ్టీ ఆఫీసర్ (పీసీఎస్‌వో) కె.వెంకటరమణారెడ్డి సూచించారు. రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఉదయం మొదలుపెట్టి రాత్రి వరకూ కలియ దిరుగుతూ విస్తృతంగా తనిఖీలు చేశారు. ఇటీవల చెన్నైలో జరిగిన రైలు ప్రమాదం దృష్ట్యా ఈ ఆడిట్ ఇన్‌స్పెక్షన్ ప్రాధాన్యం సంతరించుకొంది. ఏదో వచ్చామా చూశామా అని కాకుండా ప్రతి అంశాన్నీ సీపీఎస్‌వో నిశితంగా పరిశీలించారు. భద్రతపై పలు సూచనలు చేయడంతో పాటు సాంకేతికంగా వచ్చే ఇబ్బందులు, ముందస్తుగా గుర్తించి తగుచర్యలు తీసుకోవడంపై అధికారులకు, సిబ్బందికి అక్కడికక్కడే కౌన్సెలింగ్ చేశారు. మెము కార్ షెడ్‌ని రెండు గంటలు పరిశీలించారు. ట్రాక్ పాయింట్లు, సిగ్నలింగ్ తదితర చోట్ల నిశితంగా పరిశీలించారు. రోడ్(ట్రాక్) నెం.2లో ఉన్న 49ఏ ఇంటర్ లాకింగ్ జంక్షన్ బాక్స్‌వద్ద తనిఖీచేసి స్వల్ప సాంకేతిక లోపాన్ని గుర్తించి సిబ్బందిని నిలదీశారు. నిధులు, సామగ్రి కొరత ఉందా అని ప్రశ్నించారు. ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్షలు నిర్వహించే పరిక రాలు ప్రమాణాల ప్రకారం పనిచేసే విధంగా ఉండాలన్నారు. ట్రాక్‌లలోని అన్ని పాయింట్లనూ చెక్ చేశారు. మెడికల్, యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్లలోని పరికరాలను గమనించారు. డిప్యూటీ ఎస్ఎస్ గదిలోని సాంకేతిక వ్యవస్థ పనితీరును పరిశీలించారు. డిప్యూటీ ఎస్ఎస్‌కి లోకో పైలెట్ల(రైలు డ్రైవర్లు)కు మధ్య సమాచార మార్పిడి సవ్యంగా జరుగుతుందా అనే అంశాన్ని గమనించారు. క్రూ లాబీని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. సీపీఎస్‌వో వెంట సీఈ/టీఎం కృష్ణారెడ్డి, సీవోఎం/జీ/సీవోఎం రవిచందర్, సీఈ/జీఈ విష్ణుకాంత్, గతిశక్తి చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ (విజయవాడ) విట్టల్, ఏడీఆర్ ఎం శ్రీనివాస్, ఏడీఈఎన్ చీమల ముత్యాలరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, పీడబ్ల్యుఐ ఎ.రవి, ఎస్ఎంఆర్ రంగనాథ్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో భర్త మృతి

● భార్యకు తీవ్ర గాయాలు



అమలాపురం టౌన్, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మంగళవారం ఉదయం పేరూరు వై.జంక్షన్ సమీపంలో జరిగిన రోడ్డు ప్రమాదంలో అల్లవరం మండలం గోపాయిలంక ప్రాంతానికి చెందిన నిచ్చెనకోళ్ల రాంబాబు (60) అక్కడికక్కడే మృతిచెందాడు. పట్టణ ఎస్‌ఐ పృథ్వి తెలిపిన వివరాల ప్రకారం రాంబాబు తన భార్య రత్నం (54)తో కలిసి అమలాపురం వైపు మోటారు సైకిల్‌పై వస్తున్నాడు. శరవేగంగా వచ్చిన బొలేరో వాహనం ఢీకొట్టడంతో మోటారు సైకిలిస్టు రాంబాబు అక్కడికక్కడే మృతిచెందాడు. తీవ్రంగా గాయపడ్డ రత్నంను అమలాపురంలోని ప్రైవేటు ఆసుపత్రికి చికిత్స నిమిత్తం తరలించారు.

కుమారుడి మృతికి కారణమైన వారిని శిక్షించాలి

● మృతదేహంతో కుటుంబ సభ్యుల ధర్నా



అపార్టుమెంట్ వద్ద కుమారుడు చరణ్ శ్రీతేజ మృతదేహంతో ఆందోళన చేస్తున్న తల్లిదండ్రులు, బంధువులు

సర్పవరం జంక్షన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): కాకినాడ ఎల్బీ నగర్‌లో రాజేశ్వరి రెసిడెన్సీ అపార్టుమెంట్ పైనుంచి పడి మృతి చెందిన కుక్కల చరణ్ శ్రీతేజ (13) మృతికి కారణమైన వారిని శిక్షించి, న్యాయం చేయాలంటూ మృతుని తల్లిదండ్రులు మల్లేశ్వరరావు, సత్యదేవిలు డిమాండ్ చేశారు. మంగళవారం రాజేశ్వరి రెసిడెన్సీ వద్దకు కుమారుని మృతదేహంతో వచ్చి ఆందోళన చేపట్టారు. ఈ సందర్భంగా తల్లిదండ్రులు మాట్లాడుతూ తమ కుమారుడు మృతిపై పలు అనుమానాలు ఉన్నాయన్నారు. తొలుత ఉసిరి చెట్టు నుంచి కాయలు కోసేందుకు చెట్టుఎక్కి కింద పడిపోయాడని, పోర్టుకో ఎక్కి పడిపోయాడని, మేడపై నుంచి పడిపోయాడంటూ పలు రకాలుగా అపార్టుమెంట్ వాచ్‌మేన్, నివాసితులు చెప్పడం అనుమానాలు రేకెత్తిస్తున్నాయన్నారు. తమ కుమారుడు ఉదయం 10 గంటలకు బయటకు వెళ్లి ఇంటికి వచ్చి, మరలా గంట తర్వాత బయటకు వచ్చాడని, అపార్టుమెంట్‌లో ఉన్న వాళ్లు తమ కుమారుడ్ని లోపలికి రమ్మని పిలిచి, ఉద్దేశపూర్వకంగా హత్యచేసి ప్రమాదవశాత్తు మృతి చెందాడంటూ కల్లబొల్లి మాటలు చెబుతున్నారని ఆరోపించారు. తమ కుమారుడు మృతి చెందిన వెంటనే అపార్టుమెంట్ యాజమాని అకస్మాత్తుగా దుబాయ్ వెళ్లిపోయాడని, దీనిపై సమ గ్ర విచారణ నిర్వహించి తమ కుమారుడు మృతికి కారణమైన వారిపై కఠినచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. సర్పవరం పోలీస్‌స్టేషన్ ఎస్‌ఐలు ఏసుబాబు, రామకృష్ణమూర్తి, దర్యాప్తు అధికారి ఏఎస్‌ఐ నాగేశ్వరరావులు ఆందోళనకారులు, అపార్టుమెంట్ వాసులతో చర్చించారు. పోస్టుమార్టమ్ పూర్తయిందని, నివేదిక రాగానే దాని ఆధారంగా తదుపరి చర్యలు తీసుకుంటామని, నివేదిక, విచారణలో హత్య జరిగినట్లు నిర్ధారణ జరిగితే నిందితులపై చర్యలు తీసుకుంటామని పోలీసులు హామీ ఇవ్వడంతో ఆందోళన విరమించి, మృతునికి అంత్యక్రియలు కుటుంబ సభ్యులు నిర్వహించారు.

ఒక్కరోజు ఆగి ఉంటే కుమారుడు బతికేవాడు

సోమవారం ఒకరోజు అమ్మమ్మ ఇంటివద్ద ఉంటే తమ కుమారుడు చరణ్ శ్రీతేజ జీవించి ఉండేవాడని తల్లి సత్యవేణి కన్నీరుమున్నీరుగా విలిపిస్తున్న తీరు చూపరులను కంటతడి పెట్టించింది. దసరా సెలవుల్లో ఆనందంగా గడిపేందుకు తన ఇద్దరు కుమారులతో కలసి పుట్టింటికి రంగంపేట వెళ్లారు. సెలవులు ముగియడంతో సోమవారం ఉదయం కాకినాడ వచ్చారు. ఒక్కరోజు ఉండండి కాకినాడ వెళుదురుగానీ అని అమ్మమ్మ ఎంతగా బ్రతిమాలినా వినిపించుకోలేదు. సెలవులు అయిపోయాయి, స్కూల్‌కి వెళ్లాలంటూ చెప్పి వారించినా వినకుండా ఇంటికి వచ్చేశారు. నీరసంగా ఉందని, సోమవారం స్కూల్‌కి వెళ్లను రేపటి నుంచి వెళతాను అని తల్లి సత్యవేణికి చెప్పాడు.

మద్యం షాపుల సిండికేట్లలో వాటాల పంచాయితీ

గిరిజన లైసెన్సీలు, గిరిజనేతరుల మధ్య సాగుతున్న వివాదం

రంపచోడవరం, అక్టోబరు15(ఆంధ్రజ్యోతి): మన్యంలో మద్యం షాపుల సిండికేట్లలో వాటాల కోసం గిరిజన లైసెన్స్‌లు, గిరిజనేతరుల మధ్య పంచాయితీ సాగుతోంది. మంగళవారం ఈ విషయమై ఆయా షాపుల కేంద్రాలలో పలు సెటిల్మెంట్లు జరిగాయి. ఇక్కడ షాపుల కోసం పాడేరులో లాటరీ తీసేముందు లోపాయికారి ఒప్పందం జరిగాక లాటరీలో షాపు తగిలాక గిరిజనేతరులతో సిండికేట్ అయ్యేదిలేదని గిరిజన లైసెన్స్‌లు కొందరు చెప్పడంతో వివాదం మొదలైంది. దీంతో ఈ వివాదాన్ని సర్దుబాటు చేసుకుని షాపులను పొందాలని గిరిజనేతరులు ప్రయత్నం చేస్తూ తమకున్న రాజకీయ పలుకుబడిని ఉపయోగిస్తున్నారు. వైసీపీ, టీడీపీలు ఎవరికి వారు తమదైన శైలిలో ఈ వివాదాలను పరిష్కరించుకోవాలని చూస్తూ తమవంతు వాటాలను పొందాలని చూస్తున్నారు. ఇక్కడున్న వైసీపీ, టీడీపీ నాయకులు వేయించిన దరఖాస్తులకు లాటరీలు దక్కకపోవడంతో లాటరీల్లో ఊహించని విధంగా మద్యం షాపుల అనుభవం లేని వారికి తగలడంతో వారిని ఏదోరీతిగా ప్రసన్నం చేసుకునే పనిలో ఆయా నేతలు నిమగ్నమయ్యారు. కొన్నిచోట్ల ఒప్పందం ప్రకారం ఎవరికి షాపులు తగిలినా సిండికేట్లో అందరూ వాటాదారులే అన్న ఒప్పందాలను అమలు చేస్తుంటే, మరికొన్నిచోట్ల ఆయా ఒప్పందాలను ఖాతరు చేయని పరిస్థితులే వివాదాలకు కారణమవుతున్నాయి. ఆయా వివాదాలకు రాజకీయ జోక్యంతో పరిష్కారాలు లభిస్తున్నాయి. ఒప్పందంలో ఉన్న వారికి దరఖాస్తులతో చెల్లించిన ఫీజుకు అదనంగా 1లక్ష నుంచి 2లక్షల మధ్య చెల్లించేలా పరి ష్కారాన్ని చూపుతున్నారు. ఏదిఏమైనా వైసీపీ, టీడీపీకి చెందిన నాయ కులు సమన్వయంతోనే ఇక్కడ మద్యం సిండికేట్లను నిర్వహించు కుంటున్నారు.

వివిధ క్రీడల్లో ఉమ్మడి జిల్లా క్రీడాకారుల ఎంపిక

కాకినాడఅర్బన్, అక్టోబరు 15: వివిధ క్రీడల్లో ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లాస్థాయిలో క్రీడాకారుల ఎంపిక డీఎస్ఏ మైదానంలో మంగళవారం నిర్వహించినట్టు స్కూల్‌గేమ్స్ జిల్లా కార్యదర్శి లంకా జార్జి తెలిపారు. అండర్-14,17 విభాగాల్లో సాఫ్ట్ టెన్నిస్, అండర్-14, 17, 19 విభాగాల్లో మార్షల్ ఆర్ట్స్ అండర్-17 బాలుర వాలీబాల్ క్రీడాకారుల ఎంపికలు నిర్వహించగా 600మంది క్రీడాకారులు హాజరయ్యారన్నారు. కార్యక్రమంలో పీఈటీల జిల్లా సంఘం అధ్యక్షుడు వి.రవిరాజు, కార్యదర్శి నూకరాజు, కోశాధికారి రవిసుందర్‌కౌర్ పాల్గొన్నారు.



ఆటల పోటీల్లో రాష్ట్రస్థాయి జట్లకు ఎంపికైన క్రీడాకారులు

హెల్ప్‌లైన్‌తో దోచేశాడు

● 55,999 సొమ్ము వెనక్కి ● సైబర్ క్రైంలో పోగొట్టుకున్న వ్యక్తి

● 10 రోజుల్లో కేసు ఛేదన

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు కాజేయడానికి ప్రయత్నించిన సొమ్మును జిల్లా సైబర్ క్రైం పోలీసులు చాకచక్యంగా వెనక్కు రప్పించారు. మల్లికార్జున నగర్‌లో నివాసం ఉంటున్న కె.శ్రీకాంత్ యాక్సిస్ బ్యాంకు క్రెడిట్ కార్డు ఎంపిన్ నెంబరు మర్చిపోయారు. ఈ నెల 5న కస్టమర్ కేర్ నంబరు గురించి గూగుల్‌లో సెర్చ్ చేశారు. ఓ నకిలీ కస్టమర్ కేర్ నంబరు వచ్చింది. దీనికి ఆయన కనెక్ట్ కాగానే అవతల నుంచి ఓ వ్యక్తి మాట్లాడుతూనే ఓ యాప్ క్రియేట్ చేశాడు. అతను కోరిన విధంగా శ్రీకాంత్‌కి వచ్చిన ఓటీపీని చెప్పారు. అంతే.. క్రెడిట్ కార్డులో రూ.55,999ని సైబర్ నేరగాడు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నెం.1930 కనెక్ట్ కాకపోవడంతో సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు.. ఆ సొమ్మును ఫ్రీజ్ చేసి పది రోజుల్లో వెనక్కి రప్పించి బాధితుడికి అందజేశారు. కేసులో ప్రతిభ చూపిన సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ జి.ఉమా మహేశ్వరరావు, ఎస్‌ఐ అయ్యప్పరెడ్డి, సిబ్బంది వైఎస్‌వీ సురేశ్, పి.దుర్గా ప్రసాద్, ఎ.అరవింద్‌ని ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ క్రైం బారిన పడి మోసపోయామని గుర్తించిన వెంటనే 1930 నెంబరుకు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైం వెబ్‌సైటులో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ విధమైన మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలన్నారు.

9 నెలలైనా ఇంతేనా!

- 9 నెలలుగా సా..గుతున్న పనులు
- నిడదవోలు ఆర్‌వోబీ నిర్మాణంతో అష్టకష్టాలు
- సిబ్బంది కొరత.. నత్తనడకన పనులు
- నిర్మాణంపై కొరవడిన పర్యవేక్షణ
- వాహనదారులకు నిత్యం నరకం



వెళ్లే దారిదీ: 9 నెలలుగా నిడదవోలు మెయిన్‌రోడ్డు దుస్థితి ఇది..





రోడ్డంతా ఇలా.. వెళ్లేదెలా

నిడదవోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు ప్రధాన రహదారి అది.. ఒక్కసారి గేటు పడిందా.. గంటల తరబడి నిలబడిపోవా ల్సిందే..ఎందుకంటే ఆ దారే రహదారి.. అంతటి ప్రాధాన్యం ఉన్న రహదారిపై ఆర్‌వోబీ నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నా యి.. దీంతో ప్రజలు ఎంత కాల మిలా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల వాహనదారుల కల నిడదవోలు పట్టణంలోని ఆర్‌వోబీ నిర్మాణం.గత తెలుగుదేశంప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ వంతెన నిర్మా ణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆర్‌వోబీ నిర్మాణం రివర్స్ టెండ రింగ్ పేరుతో నిలిపివేశారు. కానీ కేంద్ర ప్రభుత్వం సేతుబంధన్ నిధు లతో ఆర్‌వోబీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన ఆర్వోబీ నిర్మాణ పనులను లాంఛనంగా ప్రారంభించా రు. ఇప్పటికి 9 నెలలు పూర్తవుతున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయి.ఆ పనుల కారణంగా మెయిన్‌రోడ్డును మూసి వేశారు.దీంతో వ్యాపారాలన్నీ పూర్తిగా నష్టాల బాట పట్టాయి. అంతే కాకుండా ఆ రోడ్డులో వెళ్లాలంటే నరకంగా మారింది. తూర్పుగోదావరి జిల్లా నుంచి నిడదవోలు మీదుగా పశ్చిమగోదావరి జిల్లాలోకి వెళ్లాల్సిన ప్రజలు అష్టకష్టాలు పడుతున్నా రు. ఆర్‌వోబీ నిర్మాణ పనులను ప్రారంభించిన కాంట్రాక్ట్ ఏజెన్సీ పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం చేపట్టకపో వడంతో పనులు నత్తనడ కన సాగుతున్నాయి.ఒకే సర్వీసు రోడ్డు ఉండడంతో రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూ డెం,తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే ప్రయాణికులు నిత్యం ట్రాఫిక్‌తో సతమత మవుతు న్నారు. మెయిన్‌రోడ్డులో రెండో సర్వీసు రోడ్డు సిద్ధంగా ఉన్నప్పటికి కాంట్రాక్ట్ ఏజెన్సీనే కంకర అడ్డంగా పోసి నేటికి ప్రారంభించ కుండా వదిలేసింది.దీంతో వాహనదారులు దారి లేక అష్టకష్టాలు పడుతు న్నారు. ఆర్‌వోబీ నిర్మాణం వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి కావాల్సి ఉన్నా పనులు జరుగుతున్న తీరు పరిశీలిస్తే మరో రెండేళ్లు పట్టే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా మంత్రి దుర్గేష్ స్పందించి పనులు వేగవంతం చేసేలా చూడాలని కోరుతున్నారు.



నిడదవోలు రైల్వే గేటు వద్ద వాహన రాకపోకలు

ఆర్‌వోబీ అంచనాలు ఇలా..

ఆర్‌వోబీ నిర్మాణ వ్యయం	రూ. 201 కోట్లు
భూసేకరణ	రూ.21 కోట్లు
సేతుబంధన్ నిధులు	రూ.24 కోట్లు
కేంద్ర రైల్వేశాఖ వాటా	రూ.56 కోట్లు
ఆర్వోబీకి సేకరించవలసిన భూమి వివరాలు	
సేకరించాల్సిన భూమి	6.14 ఎకరాలు
ప్రభుత్వ భూమి	5.11 ఎకరాలు
ప్రయివేటు భూమి	1.03 ఎకరాలు
స్థల యజమానులు	51 మంది

గ్రామాల అభివృద్ధే లక్ష్యం

» ఎమ్మెల్యే గోరంట్ల బుచ్చయ్యచౌదరి » పలుచోట్ల పల్లె పండుగ వారోత్సవాలు



వీరవరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గోరంట్ల

కడియం, అక్టోబరు 15(ఆంధ్ర జ్యోతి): గ్రామాల అభివృద్ధే ల క్ష్యంగా ప్రభుత్వం పల్లె పండుగ కార్యక్రమాలు నిర్వహిస్తోందని ఎమ్మెల్యే గోరంట్ల బు చ్చయ్యచౌ దరి అన్నారు. పల్లె పండుగ కా ర్యక్రమంలో భాగంగా మంగళ వారం వీరవరం, పొట్టిలంక గ్రామాల్లో రూ.21 లక్షలతో సీసీ రోడ్లు నిర్మాణం, శ్మశాన వాటిక ఆధునీకరణ పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కేంద్రప్రభుత్వ సహకా రంతో రాష్ట్ర ప్రభుత్వ ధృఢ సంకల్పంతో గ్రామా ల ప్రగతికి బాటలు పడుతున్నాయన్నారు. మం డలం నర్సరీ వ్యవస్థపై ఆధారపడి ఉందని, ఎక్కువ శాతం వాహనాలు తిరగడంతో గడచిన ఐదేళ్లలో రోడ్లన్నీ పూర్తిగా పాడయ్యాయన్నారు. వచ్చే పుష్కరాల నాటికి అన్ని రోడ్లు వేస్తా మన్నారు. కార్యక్రమంలో ఎంపీ పీ వెలుగుబంటి ప్రసాద్, టీడీపీ మండలాధ్య క్షుడు వెలుగుబంటి నాని, పంతం గణపతి, ముద్రగడ జమీ, బత్తుల రాము, ఆదిమూలం సాయి, ప్రత్తిపాటి రామారా వుచౌదరి, పలువురు అధికారులు పాల్గొన్నారు.

గ్రామాలు పూర్తి స్థాయిలో అభివృద్ధి

రంగంపేట, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని ఎస్టీ రాజాపురం, వడిశలేరు, రం గంపేట, చంద్రేడు, పెదరాయవరం, ముకుంద వరం, ఈలకొలను, అచ్యుతాపురం, వీరంపాలెం, జి.దొంతమూరు గ్రామాల్లో సీసీ రోడ్డు నిర్మాణ పనులకు ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎస్టీ రా జాపురంలో జరిగిన సమావేశంలో ఆయన మా ట్లాడుతూ గత ప్రభుత్వం హయాంలో ఐదేళ్ల పాటు అభివృద్ధికి నోచుకోని గ్రామాలు నేటి నుంచి పూర్తి స్థాయిలో అభివృద్ధి చెందుతాయ న్నారు. మండలంలో 17 గ్రామ పంచాయతీల్లో రూ.3.64 కోట్లతో 43 పనులు చేపట్టనున్నట్టు చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ జిల్లా ప్రధాన కార్యదర్శి ఆళ్ల గోవింద్, నీలపాల త్రిమూర్తులు, ఎలుగుబంటి సత్తిబాబు, ఎం.సాయిరాం, సత్తిబా బు, పోతుల వెంకటరావు, ఉద్దండ్రావు శ్రీను, ఆళ్ల బాబి, పలువురు అధికారులు, పాల్గొన్నారు.

వాంబేకాలనీలో సమస్యలు పరిష్కరించాలి



వాంబేకాలనీలో అవ్వతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే వాసు

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 15: వాంబే గృహాల్లో నెలకొన్న సమస్యలను పరిష్క రించి స్థానికులకు ఇబ్బందులు లేకుండా చూ డాలని ఎమ్మెల్యే ఆదిరెడ్డి శ్రీనివాస్ ఆదేశించారు. స్థానిక ఆదెమ్మదిబ్బ వాంబేకాలనీలో కూటమి నాయకులు, అధికారులతో కలిసి ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానికంగా ఉన్న డ్రైనేజీ వ్యవస్థను మెరుగుప రచాలని, మంచినీటి మోటార్లు సక్రమంగా పని చేసేలా చూడాలన్నారు. ఈ ప్రాంతంలో చేపట్టిన సీసీ రోడ్లు, మేజర్ డ్రైనేజీ నిర్మాణం త్వరగా పూర్తి చేయాలన్నారు. ప్రజలు తమకు విన్నవించిన ప్రతి సమస్యకు పరి ష్కారం చూపిస్తామన్నారు. ఎమ్మెల్యే వెంట స్థానిక నాయకులు, అధికారులు ఉన్నారు.

ఆదర్శమూర్తి అబ్దుల్ కలాం

» నన్నయ వర్సిటీ వీసీ శ్రీనివాసరావు
» ఘనంగా మాజీ రాష్ట్రపతి జయంతి
» అధికారులు, నాయకుల నివాళి



నన్నయ వర్సిటీలో కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ తదితరులు

దివాన్‌చెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రజలందరికీ ఆ దర్శమూర్తి అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాల యం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అ న్నారు. మాజీ రాష్ట్రపతి, భారతరత్న అబ్దుల్ క లాం జయంతిని మంగళవారం పలుచోట్ల ఘనం గా నిర్వహించారు. ఆయనకు పలువురు అధికా రులు, నాయకులు నివాళులర్పించారు. నన్నయ వర్సిటీలో కలాం చిత్రపటానికి వీసీ పూలమాల లు వేసి నివాళులర్పించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం కో సం, ప్రజల కోసం, విద్యార్థుల కోసం జీవితాంతం శ్రమించిన మహనీయుడు కలాం అని కొనియా డారు. విద్య, విజ్ఞాన, శాస్త్ర, సాంకేతిక రంగాలకు ఎనలేని సేవలందించిన కలాం చిరస్మరణీయుడ ని, ఆయన ఆశయాలకు అనుగుణంగా జీవించా లని సూచించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పి.విజయనిర్మల, అధ్యాపకులు పాల్గొన్నారు.

బిక్కవోలు: పందలపాక ఉన్నత పాఠశాల నిర్వహించిన అబ్దుల్ కలాం జయంతి కార్యక్ర మంలో హెచ్‌ఎం చిర్ల శ్రీనివాసరెడ్డి ఆయన చిత్ర పటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కలాంను విద్యార్థులందరూ ఆదర్శంగా తీసుకోవా లన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు కర్రి వీర్రెడ్డి, జయకృష్ణారెడ్డి, యువరాజారెడ్డి, అంజనీ కుమార్ తదితరులు పాల్గొన్నారు. కొంకుదురు ఉన్నత పాఠశాలలో జరిగిన కార్యక్రమంలో హెచ్ ఎం మల్లిపూడి శ్రీనివాస్ మాట్లాడుతూ భారత దేశం గర్వించదగ్గ శాస్త్రవేత్తగానే కాకుండా దేశ రాష్ట్రపతిగా కలాం చేసిన సేవలు చిరస్మరణీయ మన్నారు. ఆయన జయంతిని ప్రపంచ విద్యార్థి దినోత్సవంగా జరుపుకుంటున్నామని విద్యార్థు లకు వివరించారు. ఉపాధ్యాయులు శ్రీకృష్ణసాయి, ఈశ్వరరెడ్డి, వలీషా, సుధాకరరెడ్డి పాల్గొన్నారు.

ధవళేశ్వరం: స్థానిక స్ఫూర్తి చారిటబుల్ ట్రస్టు కార్యాలయంలో చైర్మన్ ముత్యాల పోసికు మార్ ఆధ్వర్యంలో కలాం చిత్రపటానికి పూల మాల వేసి నివాళులర్పించి ఆయన దేశానికి చేసిన సేవలు కొనియాడారు. అనంతరం వృద్ధులకు భోజనం ప్యాకెట్లు అందజేశారు.

రాజమహేంద్రవరం కల్చరల్: స్థానిక నందం గనిరాజు గనిరాజు జంక్షన్ వద్ద యాంకర్ చోటు ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమానికి మాజీ ఎమ్మెల్యే జక్కంపూడి రాజా, ఏపీ హౌ సింగ్ బోర్డ్ కార్పొరేషన్ మాజీ చైర్‌పర్సన్ మేడ పాటి షర్మిలా రెడ్డి, కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు టీకే విశ్వేశ్వరరెడ్డి, ఆదిత్య విద్యాసం స్థల డైరెక్టర్ ఎస్పీ గంగిరెడ్డి, పంతం చారిటబుల్ ట్రస్ట్ చైర్మన్ పంతం కొండలరావు విచ్చేసి అబ్దుల్ కలాం విగ్రహానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. కలాం సేవలను కొనియాడా రు. అలాగే ఆదిత్య డిగ్రీ కళాశాల, మహిళా డిగ్రీ కళాశాల ఎన్‌ఎస్‌ఎస్, యూత్ రెడ్‌క్రాస్ వలంటీర్ల ఆధ్వర్యంలో కలాం విగ్రహానికి నివాళులర్పిం చారు. కార్యక్రమంలో జీవీఎస్ నాగేశ్వరరావు, బి హెచ్ రమాదేవి, కె.మహేశ్వరి పాల్గొన్నారు.

రాజమహేంద్రవరం అర్బన్: రాజమహేం ద్రి మహిళా జూనియర్, డిగ్రీ, పీజీ కళాశాల లై బ్రరీలో జరిగిన కార్యక్రమంలో కలాం చిత్రపటా నికి చైర్మన్ టీకే విశ్వేశ్వరరెడ్డి పూలమాల వేసి ని వాళులర్పించారు. ప్రిన్సిపాల్ తేతలి సత్యసౌంద ర్య, కళాశాల ఎన్‌ఎస్‌ఎస్ పీవో వీరవెంకట్రావు, కె.సుధారాణి, పలువురు అధ్యాపకులు మీనాక్షి, సాయికుమారి, శ్రావణి, విజయకరుణ, లైబ్రేరి యన్ విజయవేణి, ఎన్‌ఎస్‌ఎస్ వలంటీర్లు, వి ద్యార్థులు పాల్గొన్నారు. ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల ఆవరణలో జరిగిన కార్యక్రమంలో కలాం విగ్రహా నికి ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే పూలమాల వే సి నివాళులర్పించారు. అనంతరం మాట్లాడుతూ పేపర్‌బోయ్ నుంచి మిసైల్ మేన్‌గా, రాష్ట్రపతిగా ఎదిగిన అబ్దుల్ కలాం ప్రస్థానం విద్యార్థులకు ఆదర్శప్రాయం అన్నారు. భౌతికశాస్త్ర విభాగాధిప తి కోమల లక్ష్మి, అధ్యాపకులు పాల్గొన్నారు.

కెమిస్ట్రీ లెక్చరర్ సురేఖకు ఔట్‌స్టాండింగ్ ఎడ్యుకేటర్ అవార్డు



సురేఖను సత్కరిస్తున్న ప్రిన్సిపాల్, అధ్యాపకులు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): రాజమహేంద్రవరం ప్రభుత్వ ఆర్ట్స్ కళాశాల కెమిస్ట్రీ అధ్యాపకురాలు పి.సురే ఖకు ఔట్‌స్టాండింగ్ ఎడ్యుకేటర్ అవార్డు ల భించింది. అక్టోబరు 5న థాయిలాండ్‌లో యు నైటెడ్ హెరిటేజ్ ఆర్ట్స్ అండ్ కల్చరల్ ఆర్గనైజష న్, తెలుగు అసోసియేషన్ ఆఫ్ థాయిలాండ్ సంయుక్తంగా నిర్వహించిన అంతర్జాతీయ ఉ పాధ్యాయ వేడుకలు, దసరా కల్చరల్ ఫెస్ట్‌లో భాగంగా సురేఖకు ఈ గౌరవం దక్కింది. యూహెచ్‌ఏసీవో అధ్యక్షులు రామ, టీఏటీ అ ధ్యక్షుడు పవన్ చేతులమీదుగా సురేఖ ఈ అ వార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా క ళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర ఆర్‌కే ఆమెను అభినందిస్తూ అధ్యాపకులు అందరూ తమ వృత్తికి న్యాయం చేయాలని, అవకాశాలను అందిపుచ్చుకోవాలన్నారు. సురేఖను కెమిస్ట్రీ విభాగం అధ్యాపకులు పుష్పగుచ్ఛాలతో అభి నందించారు. ఐక్యూఏసీ కోఆర్డినేటర్ అన్నపూ ర్ణ, అకడమిక్ కో ఆర్డినేటర్ రాజేశ్వరి, హెచ్ వోడీటి.శ్రీనివాస్ అధ్యాపకులు పాల్గొన్నారు.

అభ్యాస వైకల్యాలపై అవగాహన

బిక్కవోలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బిక్కవోలు భవిత కేంద్రం ఆధ్వర్యంలో మంగళ వారం స్థానిక వీర్రాజుపేటలో నిర్దిష్ట అభ్యాస వైకల్యాలపై అవగాహన ర్యాలీ జరిపారు. భవిత కేంద్ర ఐఈఆర్‌టీ సన్యాసిరావు మాట్లా డుతూ విద్యార్థి దశలో కొందరు పిల్లలు అభ్యాస వైకల్యాలకు లోనై చదువులో వెనుకబ డతారని, అక్షరాలు రాకపోవడం, పలకలేకపో వడం వంటి లక్షణాలు ఉంటాయని, వీటికి భవిత కేంద్రంలో శిక్షణ ఇచ్చి వైకల్యాలను తొలగిస్తామన్నారు. ఈ విషయాలపై విద్యా ర్థుల తల్లిదండ్రులకు అవగాహన కల్పించారు. కార్యక్రమంలో హెచ్‌ఎం జొన్నాడ లక్ష్మి, అం గన్‌వాడీ వర్కర్లు, ఆయాలు పాల్గొన్నారు.

250 గ్రాముల బంగారం చోరీ!

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్ర జ్యోతి): బంగారు ఆభరణాల చోరీపై ప్రకాశం నగర్ పోలీసులు కేసు నమోదు చేశారు. సీఐ బాజీలాల్ తెలిపిన వివరాల ప్రకారం.. హోల్ సేల్ వ్యాపారం చేసే జి.శ్రీనివాస్ తన కుటుం బంతో శ్యామలానగర్‌లో నివాసం ఉంటు న్నారు. దసరా సెలవులకు, తండ్రికి తనకు ఆస్పత్రిలో ఆరోగ్య పరీక్షలు చేయించుకోడానికి గత నెల 29న హైదరాబాద్ వెళ్లారు. తాము తిరిగి వచ్చేస్తున్నామని, ఇల్లు శుభ్రం చేయా లని పని మనిషికి సోమవారం ఫోన్ చేసి చెప్పగా.. ఆమె వెళ్లి చూసే సరికి బీరువా తెరిచి ఉండడం గమనించి శ్రీనివాస్‌కి ఫోన్ చేసిందని ఫిర్యాదులో పేర్కొన్నారు. 250 గ్రాముల బంగారం చోరీకి గురైందని మంగళవారం ఫిర్యాదు చేశారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని సీఐ వెల్లడించారు.

సాయిబాబా మృతికి సంతాపం

రాజానగరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ప్రొఫెసర్ జీఎం సాయిబాబా మృతి పట్ల రాజానగరంలోని ఏపీఆర్‌సీఎస్, ఏఐఎఫ్‌టీ యూ, ఏఐకేఎంఎస్ సీపీఎంఎల్ న్యూడెమో క్రసీ ఆధ్వర్యంలో మంగళవారం వేర్వేరుగా సంతాప సభలు నిర్వహించారు. సంతాపం ప్రకటించారు. దీనిలో భాగంగా సాయిబాబా చిత్రపటానికి పూలమాలలతో నివాళులర్పిం చారు. అతని ఉద్యమ స్ఫూర్తిని కొనియాడారు. కార్యక్రమాల్లో ఏపీఆర్‌సీఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కర్నాకుల వీరాంజనేయులు, ఏఐఎఫ్ టీయూ ఉమ్మడి తూర్పుగోదావరి జిల్లా అధ్య క్షుడు కుంచే అంజిబాబు, నాయకులు జి.నారా యణరావు, కె.మహాలక్ష్మి, సీపీఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా సీనియర్ నాయకుడు పి.వెంకట్‌నాయుడు, ఏఐకేఎంఎస్ జిల్లా అధ్యక్షుడు జనిపల్లి సత్తిబాబు పాల్గొన్నారు.

వర్షాలు పెరిగితే వరికి మాగుడు తెగులు

» జిల్లా వ్యవసాయాధికారి మాధవరావు » పలుచోట్ల 'పొలం పిలుస్తోంది'



బుచ్చింపేటలో పొలం పిలుస్తుంది కార్యక్రమం నిర్వహిస్తున్న వ్యవసాయ అధికారులు

కోరుకొండ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని బుచ్చింపేట, జగన్నాథపురం గ్రామాల్లో మంగళవారం పొలం పిలుస్తోంది కార్యక్రమం జరిగింది. ఈ సందర్భంగా జిల్లా వ్యవసాయాధికారి ఎస్.మాధవరావు ,ఏరువాక ప్రధాన శాస్త్రవేత్త మానుకొండ శ్రీనివాస్ మాట్లా డుతూ ప్రస్తుత సార్వా పంటలో వరి గింజ పాలు పోసుకునే దశలో ఉందని, ఈ దశలో వరికి మానుపండు తెగులు వచ్చే ప్రమాదముం దన్నారు. దీని నివారణకు ఒక లీటరు నీటిలో ప్రొపికొనజాల్ 1ఎంఎల్ కలిపి పిచికారీ చేసుకో వాలన్నారు. వర్షాల ఉధృతి పెరిగితే మాగుడు తెగులు వస్తుందని, దీన్ని కూడా ఈ మందు నివారిస్తుందని చెప్పారు. కార్యక్రమంలో ఏడీఏ మల్లికార్జునరావు, ఏవో గౌరీదేవి, రామతులసి, రామలక్ష్మి, అభ్యుదయ రైతులు పాల్గొన్నారు.

ఆకు ఎండు తెగులుతో జాగ్రత్త

బిక్కవోలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): రైతు లందరూ ఆకు ఎండు తెగులు పట్ల అప్రమత్తం గా వుండాలని మండల వ్యవసాయాధికారి శామ్యూల్‌జాన్ రైతులకు సూచించారు. మంగళ వారం ఆయన ఆరికరేవుల, మెళ్లూరు గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. రైతుల పొలాలను పరిశీలించి అక్కడక్కడా ఆకు ఎండు తెగులును గుర్తించారు. ఈ తెగులుకు మందులు లేవని, విత్తనశుద్ధితోనే నివారించబ డుతుందన్నారు. అలాగే ధాన్యం క్వింటాలు ధర గ్రేడు ఏ రూ.2320, కామన్ రూ.2300లకు ప్రభుత్వం ధర నిర్ణయించిందని, రైతులు తమకు నచ్చిన మిల్లుకు ధాన్యం అమ్ముకోవచ్చు నన్నారు. కార్యక్రమంలో కూటమి నాయకులు రెడ్డి శ్రీను, ఇందల వీరబాబు, అచ్యుత రామయ్య, వెటర్నరీ డాక్టర్ వీర్రాజు పాల్గొన్నారు.

పంట నమోదు తప్పనిసరి

రంగంపేట, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మండలంలోని రైతులందరూ పంట నమోదు తప్పని సరిగా చేయించుకోవాలని మండల వ్యవ సాయశాఖాధికారి శ్రీనివాసరావు తెలిపారు. సింగంపల్లి, నల్లమిల్లి గ్రామాల్లో జరిగిన పొలం పిలుస్తోంది కార్యక్రమాల్లో భాగంగా నిర్వహిం చిన రైతుల సమావేశంలో ఆయన మాట్లాడారు. వ్యవసాయ యాంత్రీకరణ, పీఎం కిసాన్ లబ్ధిదా రుల సమస్యలు, ఉద్యాన శాఖలో భాగంగా డ్రిప్, స్ప్రింకర్ల రాయి తీలను వివరిం చారు. కార్యక్ర మంలో వ్యవసా య, వ్యవసాయ అనుబంధ శా ఖల అధికారులు పాల్గొన్నారు.



ఆరికరేవులలో పొలం పిలుస్తోంది పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న రైతులు

'నాయీబ్రాహ్మణుల అభివృద్ధికి సహకరించండి'

రాజమహేంద్రవరం సిటీ, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): తమ కూటమి ప్రభుత్వం అధి కారంలోకి వచ్చిన తరుణంలో నాయీబ్రాహ్మ ణుల అభివృద్ధికి అధికారులు పూర్తిస్థాయిలో సహకరించాలని టీడీపీ జిల్లా అధికార ప్రతిని ధి దాస్యం ప్రసాద్ కోరారు. మంగళవారం రాజమహేంద్రవరంలో జిల్లా బీసీ కార్పొరేషన్ అధికారులతో ఆయన, నాయీబ్రాహ్మణ సం ఘం నాయకులు కలిసి నాయిబ్రహ్మణులకు అందించాల్సిన పథకాలు, రుణాలు, వాయిద్య కళాకారులకు భరోసా, 200 యూనిట్ల ఉచిత విద్యుత్ తదితర అంశాలపై చర్చించారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు సుందరపల్లి గోపాలకృష్ణ, కె.శ్రీనివాస్, పెండ్యాల నాగేశ్వ రావు, మానుకొండ దుర్గాప్రసాద్, జామి ప్రసాద్, కోటిపల్లి చంద్రశేఖర్, ఇనపకుర్తి ఈశ్వరరావు, బిలకుర్తి శ్రీనివాస్ పాల్గొన్నారు.

బాలాత్రిపుర సుందరికి లక్ష పుష్పార్చన

ధవళేశ్వరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): బాలా త్రిపుర సుందరి సమేత అగస్త్యేశ్వర స్వామి ఆలయంలో అమ్మవారికి లక్ష పుష్పా ర్చన నిర్వహించారు. సోమవారం సప్తనది జలాభిషేకం, విశేష కుంకుమార్చన నిర్వహిం చగా మంగళవారం ఉదయం అమ్మవారికి గులాబి, చామంతి, కమల పువ్వులతో లక్ష పుష్పార్చన నిర్వహించారు. అనంతరం ధూప సేవ, పంచహారతులు ఇచ్చి భక్తులకు తీర్థప్ర సాదాలు అందజేశారు.

అక్రమ తవ్వకాలను అడ్డుకోవాలి

దివాన్‌చెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలోని కొత్తతుంగపాడు రెవెన్యూ పరి ధిలోని జంగంమెట్ట పక్కనున్న చిన్నకొండ లో ని స.నెం 974/1లో దాదాపు 88 సెంట్లు ప్ర భుత్వమెట్టను కూటమి ప్రభుత్వంలోని కొందరు నాయకులు అక్రమంగా తవ్వుతున్నా రని డీసీసీ మాజీ ఉపాధ్యక్షుడు యాళ్ల మాచ రయ్య మంగళవారం ఆరోపించారు. దీనిపై అ ధికారుల పర్యవేక్షణ కొరవడిందని, సంబం ధిత ఉన్నతాధికార్లు స్పందించి తవ్వకాలను ని లుపుదల చేయాలన్నారు.

ప్రధాని మోదీది సమర్థవంతమైన పాలన

» ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి » హరియాణాలో బీజేపీ విజయంపై హర్షం



అనపర్తిలో ఎమ్మెల్యేకు కేక్ తినిపిస్తున్న సర్పంచ్ హేమతులసి

అనపర్తి అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): హరి యాణాలో బీజేపీ మూడోసారి ప్రభుత్వాన్ని ఏర్పాటు చేయడం కేంద్రంలో ప్రధాని నరేంద్ర మోదీ సమర్థ పాలనకు నిదర్శనమని ఎమ్మెల్యే నల్లమిల్లి రామకృష్ణారెడ్డి అన్నారు. హరియాణాలో బీజేపీ ప్రభుత్వం ఏర్పాటు చేస్తున్న సం దర్భంగా మంగళవారం అనపర్తి దేవీచౌక్ వద్ద కూటమి నాయకులు సంబరాలు జరుపుకున్నా రు. ఎమ్మెల్యే నల్లమిల్లి కేక్ కట్ చేసి నాయకు లకు తినిపించారు. భారీగా బాణసంచా కాల్చా రు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ దేశం అభివృద్ధి చెందాలన్నా, రాష్ట్రాలు సుభిక్షంగా ఉండాలన్నా మోదీ నాయకత్వం ఎంతో అవసర మన్నారు. కార్యక్రమంలో నాయకులు శివరామకృ ష్ణంరాజు, గిరిడా గంగాభవాని, సిరసపల్లి నాగే శ్వరరావు, సత్తి దేవదానరెడ్డి, తమలంపూడి సుధాకరరెడ్డి, కొవ్వూరి శ్రీనివాసరెడ్డి, ఎన్‌ఆర్‌కె ప్రసాదరెడ్డి పాల్గొన్నారు.

20వేల పైబడి బీజేపీ సభ్యత్వాలు

అనపర్తి నియోజకవర్గంలో సుమారు 20వేల పైబడి బీజేపీ సభ్యత్వ నమోదు జరిగినట్టు ఎమ్మెల్యే రామకృష్ణారెడ్డి తెలిపారు. సభ్యత్వ నమోదు బుధవారం ముగుస్తున్న సందర్భంగా ఆయన మాట్లాడుతూ సభ్యత్వ నమోదులో అనపర్తి ఉమ్మడి ఉభయగోదావరి జిల్లాలో మొదటి స్థానం, రాష్ట్రంలో రెండో స్థానంలో ఉందని చెప్పారు.

శ్రీనివాసరావు కృషి ప్రశంసనీయం

గోకవరం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): బీజేపీ సభ్యత్వ నమోదులో విశ్వహిందూ ధర్మ పరిర క్షణ రామసేన అధ్యక్షులు కంబాల శ్రీనివాసరావు కృషి ప్రశంస నీయమని పలువురు పేర్కొన్నారు. బీజేపీ సభ్య త్వ నమోదులో ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా మొదటి స్థానంలో నిలిచిన నేప థ్యంలో శ్రీనివాస రావును స్థానిక తంటికొండ రోడ్డులోని సీఎండీ కేఎస్‌పీవీ లేఅవుట్‌లో బీజేపీ నాయకులు సత్కరించారు. ఈ సందర్భంగా పార్టీ జిల్లా కార్యదర్శి మట్టా మంగరాజు మాట్లా డుతూ గతంలో ఎవ్వ రూ చేయని విధంగా అతి తక్కు వ కాలంలో అత్యధిక సభ్యత్వ నమోదు చేసిన ఘనత శ్రీని వాసరావుదే నని, అలాగే హిందూ దేవాల యాల అభివృద్ధికి, సమాజ సేవ కు ఎంతో కృషి చేస్తున్నారన్నారు. కార్యక్రమంలో కోన వెంకటసురేష్, ఐ.బాపన్నదొర, మణికంఠ, ఇన గోటి బాపన్నదొర, బత్తుల వెంక న్నబాబు, మామిడి అయ్యప్ప, తామర్ల రాంబాబు పాల్గొన్నారు.



గోకవరంలో శ్రీనివాసరావును సన్మానిస్తున్న బీజేపీ నాయకులు

పరిశోధనలు కొనసాగించే వారికి ప్రోత్సాహం

జీజీయూ సెమినార్‌లో కొరియా రీసెర్చ్ ప్రొఫెసర్ గంగరాజు

రాజానగరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): పరి శోధనలు కొనసాగించే వారికి అంతర్జాతీయంగా కూడా ప్రోత్సాహం లభిస్తోందని దక్షిణ కొరియా లోని చుంగ్ అంగ్ విశ్వవిద్యాలయంలోని యాని మల్ బయోటెక్నాలజీ, బీటీటీ పరిశోధనా కేం ద్రం బ్రెయిన్ పూల్ రీసెర్చ్ ప్రొఫెసర్ గంగరాజు జి. అన్నారు. గోదావరి గ్లోబల్ విశ్వవిద్యాలయం లోని ఎఫ్‌ఈడీ విభాగంగా ఆధ్వర్యంలో బహుళ ఫంక్షన్ అప్లికేషన్స్‌లో నానో టెక్నాలజీ ఇటీవల సాధించిన ప్రగతి అనే అంశంపై మంగళవారం జరిగిన సెమినార్‌కు ఆయన ముఖ్యఅతిథిగా వి చ్చేసి మాట్లాడారు. నానో టెక్నాలజీ అంటే నానో స్కేల్ వద్ద అణువులను మార్చడం ద్వారా నిర్మా ణాలు పరికరాలు వ్యవస్థలను రూపొందించడం, ఉత్పత్తి చేయడం, ఉపయోగించడం కోసం అం కితమైన సైన్స్, ఇంజనీరింగ్‌శాఖ సూచిస్తోంద న్నారు. నానో టెక్నాలజీ ఇటీవల ఏయే రంగాల్లో ఏవిధంగా ఉపయోగిస్తున్నారో సవివరంగా వివ రించారు. ఈ సందర్భంగా గంగరాజును సత్క రించారు. కార్యక్రమంలో జీజీయూ వీసీ యు. చంద్రశేఖర్, డైరెక్టర్ ఎం.శ్రీనివాసరావు, రిజిస్ట్రార్ పీఎంఎంఎస్‌శర్మ, ప్రిన్సిపాల్ టి.జయానంద కుమార్, బి.శ్రీనివాసరాజు, హెచ్‌వోడీలు నిర్మలా దేవి, ఆనందకుమార్ పాల్గొన్నారు

కాంట్రాక్టు, ఔట్‌సోర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలి

సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు



సీపీఐ శాఖా సమావేశంలో మాట్లాడుతు న్న జిల్లా కార్యదర్శి తాటిపాక మధు

రాజమహేంద్రవరం అర్బన్, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : మున్సిపల్ కాంట్రాక్టు, ఔట్ సో ర్సింగ్ కార్మికులను పర్మినెంట్ చేయాలని సీపీఐ జిల్లా కార్యదర్శి తాటిపాక మధు అన్నారు. సీ పీఐ ప్రజల పార్టీగా బతకాలంటే శాఖ నిర్మాణం తప్పనిసరి అని పేర్కొన్నారు. మంగళవారం రా జమహేంద్రవరంలోని రెల్లి కాలనీ, కాతేరుల్లో సీ పీఐ శాఖ సమావేశాలు జరిగాయి. వాటిలో ము ఖ్య అతిథిగా పాల్గొన్న మధు మాట్లాడుతూ నూ తన వేతనాల సిఫార్సు కమిటీ మేరకు ఒప్పంద కార్మికులకు వేతనాలు చెల్లించాలన్నారు. ఆప్కో స్ రద్దు చేసి నేరుగా మున్సిపాలిటీలే కార్మికుల కు వేతనాలు ఇవ్వాలన్నారు. ఔట్‌సోర్సింగ్ కార్మి కులకు రిటైర్మెంట్ బెనిఫిట్స్ అమలు చేయాలని కోరారు. జిల్లాలో సీపీఐ శాఖ సమావేశాలు 70 శాతం పూర్తి చేశామని తెలిపారు. సమావేశం లో నగర కార్యదర్శి కొండలరావు, కాతేరుశాఖ కార్యదర్శి శ్రీనివాస్, నగర కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు విద్యార్థుల ఎంపిక

తాళ్లపూడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గజ్జరం హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయినట్టు పాఠశాల హెచ్‌ఎం మోహన్ మంగళవారం తెలిపారు. ఏలూరులో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీల్లో ఎం.మిల్కీ, జి.శరణ్‌తేజ్ ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా విద్యార్థులను అభినందించారు.

జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా నిమ్మల రామానాయుడు



రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా రాష్ట్ర జలవనరుల శాఖ మంత్రి నిమ్మల రామా నాయుడును ప్రభుత్వం నియ మించింది. పశ్చిమగోదావరి జిల్లా పాలకొల్లు నుంచి మూడు సార్లు ఎమ్మెల్యేగా ఎన్నికై రికార్డు సృష్టించారు.ప్రస్తుత కేబినెట్‌లో జల వనరుల శాఖ మంత్రిగా ఉన్నారు. జిల్లా పట్ల ఆయనకు మంచి అవగాహన ఉంది. ఎం దుకంటే పూర్వపు పశ్చిమగోదావరి జిల్లా నుంచి కొవ్వూరు,నిడదవోలు, గోపాల పురం మూడు నియోజకవర్గాలు తూర్పుగోదావరి జిల్లాలో కలిశాయి.అంతే కాకుండా మిగిలిన నాలుగు రాజమహేం ద్రవరం సిటీ, రూరల్, రాజానగరం, అనపర్తి నియోజకవ ర్గాలపై కూడా పట్టుంది. ఇరిగేషన్ మంత్రి కావడం వల్ల ధవళేశ్వరం ఇరిగేషన్ సర్కిల్ పనితీరు మెరుగుపరిచే అవ కాశం ఉంది. ఇన్‌చార్జిమంత్రిగా నియమితులైన సందర్భంగా ఆయనను విలేకరులు ప్రశ్నించగా గోదావరి జిల్లాలకు సేవ చేసే అవకాశం లభిం చడం అదృష్టంగా భావిస్తున్నా నన్నారు. రాయలసీమలోని కర్నూలు జిల్లాకు కూడా తనను ఇన్‌చార్జి మంత్రిగా ప్రభుత్వం నియమించిందని చెప్పారు.



9 నెలలైనా ఇంతేనా! 8



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి దుర్గేష్ చిత్రంలో టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు పల్లా శ్రీనివాసరావు, మంత్రి అచ్చెన్నాయుడు, జవహర్, ఎమ్మెల్యేలు ఆదిరెడ్డి వాసు, నిమ్మకాయల చినరాజప్ప, వరుపుల సత్యప్రభ, మిరియాల శిరీష, ఆదిరెడ్డి అప్పారావు, జీవీఆర్ చౌదరి, గన్నికృష్ణ, బూరుగుపల్లి శేషారావు తదితరులు

ఎమ్మెల్సీ విజయం మనదే కావాలి

మళ్లీ సార్వత్రిక ఎన్నికల ఒరవడి కొనసాగాలి.. గెలుపు మనదే కావాలి..మన ప్రభుత్వం ఏర్పడిన తరువాత ఇవే మనకు తొలి ఎన్నికలు.. అందరూ కష్టపడాలి.. ఎక్కడా వెనక్కు తగ్గవద్దంటూ నాయకులు పిలుపునిచ్చారు.. ఉభయగోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికపై మంగళవారం రాజమహేంద్రవరంలో కూటమి నాయకులు సమా వేశం నిర్వహించారు.. రేపటి నుంచే పట్టభద్రులను ఓటర్లుగా నమోదు చేయించాలని సూచించారు. అభ్యర్థిని ముందస్తుగా ప్రకటించేలా అధినాయకత్వంతో మాట్లాడదాం.. అభ్యర్థి ఎవరైనా గెలుపు బాట వేయాలన్నారు. - వివరాలు 6లో

ఇన్‌స్టాగ్రామ్‌లో నకిలీ యాప్‌నకు..
రూ.28.30 లక్షలు
ట్రేడింగ్ పేరుతో సైబర్ వల
మోసపోయిన కాంట్రాక్ట్ లెక్చరర్

కొవ్వూరు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఇన్‌స్టాగ్రామ్‌లో మోసపూరిత యాప్‌తో సైబర్ నేరగాళ్లు ఒక వ్యక్తి నుంచి రూ. 28.30 లక్షలు కాజేసినట్టు కొవ్వూరు పట్టణ సీఐ పి.విశ్వం తెలిపారు. పట్టణానికి చెందిన జూనియర్ కాంట్రాక్టు లెక్చరర్ కండాల వెంకట ద్వారకా శ్రీనివాస్ షేర్స్ వ్యాపారం చేస్తుంటారు. దీనిలో భాగంగా ఇటీవల ఇన్‌స్టాగ్రామ్‌లో మోతీలాల్ ఆశ్వాల్ ఇనిస్టిట్యూషనల్ అకౌంట్ యాప్‌నకు కస్టమర్ కేర్ సూచనల మేరకు నాలుగు అకౌంట్స్‌కి దఫదఫాలుగా రూ. 28.30 లక్షలు చెల్లించారు. శ్రీనివాస్ తన పేరు మీద షేర్స్‌లో ఉన్న సొమ్ము విత్‌డ్రా చేసుకోవడానికి ప్రయత్నం చేశాడు. అయితే షేర్స్‌లో ఉన్న సొమ్ము తన అకౌంట్‌కి బదిలీ కాకపోవడంతో రాజమహేంద్రవరం వెళ్లి మోతీలాల్ ఆశ్వాల్ ట్రేడింగ్ కంపెనీ ప్రతినిధులను సంప్రదించాడు. ఇన్‌స్టాగ్రామ్‌లో యాప్‌కి తమకు సంబంధం లేదని, తమకు ఏ విధమైన యాప్‌లు లేవని, థర్డ్ పార్టీ అకౌంట్స్‌కి సొమ్ము పంపించడం ఉండదని ట్రేడింగ్ కంపెనీ ప్రతినిధులు తెలిపారు. దీంతో శ్రీనివాస్ మోసపోయినట్టు తెలుసుకుని లబోదిబోమన్నాడు. ఈ మేరకు మంగళవారం పోలీసులకు ఫిర్యాదు చేయగా కేసు నమోదు చేసినట్టు సీఐ తెలిపారు.

లారీ ఢీకొని టీచర్ మృతి
మామిడిచెట్టు పడి మహిళ
హెల్ప్‌లైన్‌తో దోచేశాడు 8



- ఎక్కడికక్కడ ఒక్కటైన సిండికేట్లు
- మళ్లీ బెల్ట్ తీసే యోచన?
- గ్రామాల్లో ఏర్పాటుపై సమాలోచన
- నిడదవోలులో వేలానికి రెడీ?
- మూడు రోజుల్లోనే ఫుల్‌గా
- అద్దెకు షాపుల వెతుకులాట
- డిపోలకు బ్రాండెడ్ మద్యం
- జగన్ మద్యానికి ఇక చెక్

నేటి నుంచి మద్యం షాపులు రెడీ

(రాజమహేంద్రవరం-ఆంధ్రజ్యోతి)

ఇటు మద్యం వ్యాపారులు.. అటు మద్యపాన ప్రియులకు మంచిరోజులొచ్చాయి.గత ఐదేళ్లగా ఎదురుచూస్తున్న రోజు రానే వచ్చింది. బుధవారం నుంచి ప్రైవేటు మద్యం దుకాణాలు తెరుచుకోనున్నాయి. ఇప్పటి వరకూ అమలైన జగనన్న పిచ్చి మద్యం పాలసీకి సమూలంగా తెరపడనుంది. మద్యం విధానంలో కూటమి ప్రభుత్వం సమూలంగా మార్పులు తెచ్చింది. జగన్ ప్రభుత్వానికి భయపడి రాష్ట్రం నుంచి పారిపోయిన అంతర్జాతీయ కంపెనీల బ్రాండ్లు కూటమి ప్రభుత్వం వచ్చాక క్యూ కట్టాయి. దీంతో ఇప్పటికే ఆయా డిపోలకు పాత బ్రాండ్లు వచ్చాయి. నాణ్యమైన సరుకు ఇవ్వడమే లక్ష్యంగా నూతన మద్యం పాలసీ 2024-26ని అమలు చేస్తోంది.జిల్లాలో 125 మద్యం షాపులను లాటరీ విధానంలో సోమవారం కేటాయించిన విషయం తెలిసిందే.

మూడు రోజుల్లో ముస్తాబు..

సోమవారం షాపులు కేటాయించగా తొలి విడత ఫీజు చెల్లింపులు మంగళవారం చాలా వరకూ పూర్తయ్యాయి.ఈ మేరకు మద్యం షాపులకు అబ్కారీ శాఖ ప్రొవిజనల్ లైసెన్సులు జారీ చేస్తుంది. వ్యాపారులకు లాగిన్ ఐడీ, పాస్‌వర్డ్ క్రియేట్ అయిన తర్వాత ప్రభుత్వ మద్యం డిపోల నుంచి సరుకు కొనుగోలు చేయాల్సి ఉంటుంది. ఆ పోర్టల్ మంగళవారం రాత్రి 12గంటల తర్వాత తెరుచుకోనుంది. అప్పుడు వ్యాపారులు స్టాకు ఆర్డరు పెట్టి ఆన్‌లైన్ ద్వారా సొమ్ము చెల్లించాలి. అనంతరం డిపోల నుంచి దుకాణాలకు మద్యం చేరుకుంటుంది. షాపులను అద్దెకు చూసుకోవడం, ముస్తాబు చేయడం, సరుకు రావడం వంటివి అన్నీ పూర్తయి మొత్తం 125 మద్యం దుకాణాలు పూర్తిగా అందుబాటులోకి రావడానికి మూడు నాలుగు రోజుల సమయం పట్టొచ్చని చెబుతున్నారు.ఇప్పటికే మద్యం షాపులు దక్కించుకున్న వాళ్లు అద్దె షాపుల వెతుకులాటలో ఉన్నారు. చా లా వర కూ గతంలో ప్రభుత్వ మద్యం దుకాణాలు ఉన్న షాపుల్లోనే కొత్త మద్యం షాపులు రానున్నా యి.

సిండికేటు సిత్రాలు..

మద్యం షాపులు దక్కించుకోవడానికి కొందరు సిండికేటుగా ఏర్పడి అప్లికేషన్లు ఇచ్చారు. ఒక్కొక్కరు రూ.2 లక్షలు దరఖాస్తు ఫీజు చెల్లించి 100 దరఖాస్తులు ఇస్తే దానిలో ఓ ఐదు షాపులు దక్కాయనుకుంటే వంద మందీ ఐదు షాపుల్లో భాగస్వాముల కిందే లెక్క. లైసెన్సు ఫీజు, షాపుల అద్దెలు, మామూళ్లతో పాటు ఆ 100 దరఖాస్తులకు అయిన రూ.2 కోట్లనూ పెట్టుబడిగానే పరిగణిస్తారు. దీంతో భాగస్వాములు ఎక్కువై గొడవలు జరుగుతాయని వ్యాపారస్తులు భయపడుతున్నారు. పైగా ఇప్పటి వరకూ ప్రభుత్వం 20 శాతం మార్జిన్ ఇస్తానని చెప్పిందని అంటున్నారు. మంగళవారం సాయంత్రం ప్రభుత్వం జారీ చేసిన జీవోతో పాటు రౌండింగ్ ఆఫ్‌లు వంటివి పోను 10 శాతమే మార్జిన్ అవుతుందని చెబుతున్నారు. పర్మిట్ రూమ్‌లు ఇవ్వకపోవడంతో భారీగా నష్టపోతామని వాపోతున్నారు. దీంతో అనధికారికంగా ధరలు పెంచి అమ్మే అవకాశం కనిపిస్తోంది. ఇప్పటికే బెల్టు షాపులపై అంతర్గతంగా వ్యాపారుల్లో బేరసారాలు జరుగుతున్నాయి. బెల్టు షాపుల పరిధి, ఎక్కడెక్కడ బెల్టు షాపులకు మద్యం అనధికారికంగా సరఫరా చేయాలనే దానిపై చర్చించుకుంటున్నారు. మద్యం షాపులు ఫలానా చోట అని ప్రభుత్వం నిర్దేశించకపోవడంతో బెల్టుషాపులకు డిమాండు పెరిగింది.

బెల్ట్‌షాపులకు అనధికార వేలమట!

నిడదవోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో ప్రైవేటు మద్యం షాపుల కేటాయింపు పూర్తయ్యింది. నేటి నుంచి అన్ని బ్రాండ్ల మద్యం ప్రియులకు అందుబాటులోకి రానున్నాయి. జిల్లా వ్యాప్తంగా మద్యం షాపులు దక్కించుకునేందుకు సిండికేట్లుగా ఏర్పడి భారీగా దరఖాస్తులను సమర్పించారు. మద్యం షాపులు దక్కించుకున్న సిండికేట్లు బెల్టు షాపులపై ప్రధానంగా దృష్టి సారించాయి. బుధవారం మద్యం షాపులను ప్రారంభించిన వెంటనే బెల్టు షాపులు ప్రారంభించేందుకు సన్నాహాలు చేస్తున్నారు. నిడదవోలు మండలంలో ఒక గ్రామ వైసీపీ నాయకుడి పేరున ఒక మద్యం దుకాణం రాగా అతని సిండికేట్‌కు మరో నాలుగు షాపులు వచ్చాయి. సిండికేట్‌లో ఉన్న గ్రామ టీడీపీ నాయకులను అడ్డం పెట్టుకుని అనధికారికంగా బెల్టు షాపులను ప్రారంభించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాడు. టీడీపీ నాయకులను ముందుపెట్టి కథనడిపితే ఇబ్బందులు ఉండవని పావులు కదుపుతున్నాడు. నిడదవోలు పట్టణ మండల పరిధిలో ఐదు మద్యం దుకాణాలకు సంబంధించి బెల్టు షాపుల నిర్వహణకు రహస్యంగా వేలంపాటలు నిర్వహించేందుకు ఆ వైసీపీ గ్రామ నాయకుడు సిద్ధమయ్యాడు. నిడదవోలు నియోజక వర్గంలో 19 మద్యం దుకాణాలకు 863 టెండర్లు రాగా నిడదవోలు పట్టణానికి సంబంధించి నాలు గు షాపులకు 191 టెండర్లు, మండలానికి సంబంధించి ఐదు షాపులకు 213 టెండర్లు రావడం విశే షం. ప్రస్తుతం ఈ రహస్య అనధికారిక బెల్టు షాపు ల వేలం పాటలపై ఎక్సయిజ్ అధికార్లు దృష్టి సారి ంచాల్సి ఉంది.ఆ వైసీపీ నాయకుడి బెల్టు తీయకపోతే అక్రమ మద్యం ఏరులైపారే అవకాశం ఉంది.



పోకచెక్కలు..తామరగింజలతో దుర్గమ్మకు చీర

రాజానగరం,అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఆసక్తి.. తపన ఉంటే కష్టమైనా ఇష్టంగా భక్తిశ్రద్ధలతో చేస్తారు.. అబ్బా అనిపించుకుంటారు. మండలంలో చక్రద్వారబంధం దేవిచౌక్‌లో కనకదుర్గమ్మ విగ్రహాన్ని చూసి మంగళవారం అందరూ ఆశ్చర్యపోయారు.ఎందుకంటే అంత ప్రత్యేకంగా అలంకరించారు.ప్రతి ఏడాది దసరా ఉత్సవాల్లో భాగంగా అబ్బురపరిచే రీతిలో అమ్మవారిని అలంకరించడం ఆనవాయితీగా వస్తోంది.దీనిలో భాగంగానే ఈ ఏడాది ఆరుకిలోల పోకచెక్కలు, 2 కిలోల తామర గింజలతో చీరను నిడదవోలు కనకాచారి స్వయంగా తయారు చేశారు. వారం రోజులు శ్రమించి పోకచెక్కలు, తామర గింజలతో చీర,కిరీటం రూపొందించి అమ్మవారికి సమర్పించినట్టు తెలిపారు. ఈ మేరకు మంగళవారం అమ్మవారికి చీరను అలంకరించారు.కనకాచారికి ఉత్సవ కమిటీ సభ్యులు అభినందనలు తెలిపారు.



ఖాళీగా ఉన్న ఇసుక ర్యాంప్.. కలెక్టర్ ప్రశాంతి

నేటి నుంచి ఇసుక ఓపెన్

- ఓపెన్ ఇసుక రీచ్‌లలో తవ్వకాలు
- ఎటువంటి యంత్రాలు వినియోగించరాదు
- జిల్లా స్థాయి సమావేశంలో కలెక్టర్ ప్రశాంతి

రాజమహేంద్రవరం సిటీ/రూరల్, అక్టోబరు 15: ఇసుక రీచ్‌లను కేటాయించబడిన ఎల్ వన్ అభ్యర్థులు బుధవారం నుంచి తవ్వకాలు చేపట్టాలని కలెక్టర్ పి.ప్రశాంతి ఆదేశించారు. కలెక్టరేట్‌లో మంగళవారం జరిగిన జిల్లా స్థాయి ఇసుకకమిటీ సమావేశంలో ఆమె మాట్లాడారు. ఇసుక తవ్వకాలు జాతీయ గ్రీన్ ట్రిబ్యునల్ మార్గదర్శకాలకు అను గుణంగా ఉండాలన్నారు. ఇప్పటికే జిల్లాలో 14 ఓపెన్ రీచ్‌లు కేటాయించామన్నారు. ఎటువంటి యంత్రాలు వినియోగించకుండా కనీసం రోజుకు వెయ్యి మెట్రిక్ టన్నుల ఇసుక తవ్వకాలు చేయా లన్నారు. రీచ్‌లలో విధులు నిర్వహిస్తున్న అధికారులు, సిబ్బంది సమయ పాలన పాటించాలన్నారు. ఎటువంటి ఉల్లంఘన లేకుండా చూసుకోవాలన్నారు. ఇసుక తరలించే ప్రతి వాహనానికి జియో టాగింగ్ సిస్టమ్ ఏర్పాటు చేయడం జరిగిందన్నారు.ఈ మేరకు క్రాస్ చెక్ చేయ డంతో పాటు డీవియేషన్ చేసిన వారిపై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. ఎంపీడీవో, పంచాయతీ కార్యదర్శులు తనిఖీలు ముమ్మరంగా నిర్వహించి నివేదికను ఆర్డీవోకి పంపాలని ఆదేశించారు. సమావేశంలో అదనపు ఎస్పీ ఏవి సుబ్బరాజు, ఆర్డీవోలు ఆర్.కృష్ణనాయక్, రాణి సుస్మిత, జిల్లా గ్రౌండ్ వాటర్ అధికారి వై.శ్రీనివాస్, ఇరిగేషన్ ఈఈ ఆర్.కాశీ విశ్వేశ్వరరావు, జిల్లా రవాణా అధికారి ఆర్.సురేష్ పాల్గొన్నారు.

అందుబాటులో ఆఫ్‌లైన్ బుకింగ్‌లు

వినియోగదారులకు ఇసుకను మరింత సులభంగా అందిం చేందుకు బుధవారం నుంచి ఆఫ్‌లైన్ బుకింగ్ అందుబాటులోకి తెచ్చినట్టు కలెక్టర్ చెప్పా రు.ఈ మేరకు జిల్లాలో జేసీ ఎస్.చిన్నరాముడు, జిల్లా మైన్స్ ఏడీ డి.ఫణి భూషణ్ రెడ్డి ఆధ్వ ర్యంలో ఇసుక ఆఫ్‌లైన్ బుకింగ్ నకు చర్యలు తీసుకోవడం జరిగిందన్నారు. ఆన్‌లైన్, ఆఫ్‌లైన్ బుకింగ్ విభజనలో ఆన్‌లైన్ బుకింగ్ డెలివరీలు ఉదయం 6 నుంచి మధ్యాహ్నం 12 గంటల మధ్య పూర్తవుతాయని.. ఆఫ్‌లైన్ బుకింగ్‌లు మధ్యాహ్నం 12 నుంచి సాయంత్రం 6 గంటల వరకు లోడ్ చేస్తారని తెలిపారు.ఆధార్ కార్డు, వినియోగదారుడి మొబైల్ నెంబరుతో బుకింగ్ చేస్తే ఓటీపీ వస్తుందన్నారు.



రేషన్ బియ్యం.. పక్కదారి!
ఆగని అక్రమ రవాణా

- కన్నెత్తి చూడని అధికారులు
- ఇటీవల మంత్రి నాదెండ్ల తనిఖీ
- భారీగా పట్టుబడిన బియ్యం
- అయినా కదలని యంత్రాంగం
- వీడని మామూళ్ల మత్తు
- సర్కారు కొనేది రూ.43.40
- కిలో రూ.15కే విక్రయం
- బియ్యం ఇచ్చే చోటే కొనుగోళ్లు

ఇటీవల పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనకు వచ్చారు.. జిల్లాలో మూడు రైస్ మిల్లులు తనిఖీ చేశారు.. ఆ మూడు రైస్ మిల్లుల్లోనూ సుమారు 90 వేల కిలోల పైనే రేషన్ బియ్యం పట్టుకున్నారు.. ఈ ఒక్క సంఘటన చాలు జిల్లాలో సివిల్ సప్లయిస్ అధికారులు పనిచేస్తున్నారో లేదో చెప్పడానికి.. ఎందుకంటే సాధారణ తనిఖీల్లో భాగంగా మంత్రి మనోహర్ అక్రమ బియ్యం పట్టుకుంటే.. ఇక్కడే ఉండే అధికారులు దృష్టి పెడితే అక్రమార్కుల ఆటలు సాగుతాయా...? ఒక్కసారి ఆలోచించాల్సిందే మరి..

గోకవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : రేషన్ బియ్యం అక్రమ రవాణా యథేచ్ఛగా సాగుతోంది. ప్రభుత్వం మారినా అక్రమార్జనకు అలవాటుపడిన అధికారుల తీరు మారలేదు. దీంతో అక్రమార్కులు రెచ్చిపోతున్నారు. రెవెన్యూ, పౌరసరఫరాల శాఖ కనుసన్నల్లోనే చౌక బియ్యం పక్కదారి పడుతుందనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. రేషన్ బియ్యంతో దొరికిన అక్రమ వ్యాపారులపై విజిలెన్స్, పౌర సరఫరాల అధికారులు 6ఏ కేసులు పెడుతున్నా బెదరడంలేదు. జిల్లా వ్యాప్తంగా బియ్యం అక్రమ రవాణా సాగుతున్నా అధికారులు అన్నీ తెలిసి కళ్లు మూసుకుని కూర్చుంటున్నారు. కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత మొదటి నెల మాత్రమే బియ్యం కొనుగోలు చేసేందుకు అక్రమార్కులు భయపడ్డారు. ఆ తరువాత షరా మామూలేగానే అక్రమ వ్యాపారం సాగుతోంది. పౌర సరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఎక్కడికి వెళ్లినా అక్రమ రేషన్ బియ్యం పట్టుకుంటూనే ఉన్నారు.అయినా అక్రమ బియ్యం రవాణా తీరులో మాత్రం మార్పు రావడంలేదు. తాజాగా గత బుధవారం నల్లజర్ల, దేవరపల్లిలో మూడు రైస్ మిల్లుల్లో దాడి చేసి పట్టుకున్నారు.

సర్కారు కొనేది కిలో రూ.43.40

ప్రభుత్వం రేషన్ బియ్యం కిలో రూ.43.40కు కొనుగోలు చేసి రేషన్ కార్డుదారులకు ఉచితంగా అందిస్తోంది. ఆ బియ్యాన్ని కిలో రూ.15 నుంచి రూ.16ల వరకు అక్రమ వ్యాపారులకు విక్రయిస్తున్నారు. కొందరైతే ఎండీయూ వాహనాల వద్దే కాపుకాచి వినియోగదారుల వద్ద నుంచి బియ్యాన్ని కొనుగోలు చేస్తున్నారు.కొన్ని చోట్ల ఎండీయూ వాహనదారులే బియ్యం కొనుగోలు చేసి వ్యాపారులకు విక్రయిస్తున్నారు. అనంతరం బియ్యాన్ని ద్విచక్ర వాహనాల్లో రహస్య ప్రాంతాలకు తరలిస్తారు.రాత్రి వేళల్లో దాచిన గొడౌన్‌ల నుంచి బియ్యాన్ని భారీ వాహనాలపై నల్లబజారు, రైస్ మిల్లులకు తరలించేస్తున్నారు.గోకవరం మండలంలోని పలు గ్రామాల్లో సుమారు 40 శాతం రేషన్ బియ్యం మాఫియా చేతుల్లోకి చేరి పోతుంది. ప్రధానంగా గోకవరం, కామరాజుపేట, తిరుమలాయపాలెం, వెదురుపాక, కృష్ణునిపాలెం, రంపయర్రంపాలెం, తంటికొండ తదితర గ్రామాల్లో అడ్డూ అదుపూ లేకుండా రేషన్ బియ్యం పక్కదారి పడుతుంది. రైస్ మిల్లర్లకు అక్రమ వ్యాపారులు కిలో రూ.30 నుంచి రూ.32ల పైనే విక్రయిస్తున్నట్టు సమాచారం. మిల్లర్లు ఈ బియ్యాన్ని మరోసారి మరపట్టించి, పాలిష్ చేసి వాటినే బ్రాండెడ్ బియ్యంగా బహిరంగ మార్కెట్లో కిలో రూ.40 నుంచి రూ.50ల వరకు విక్రయించుకుంటున్నారు.



గత బుధవారం పౌరసరఫరాల మంత్రి నాదెండ్ల మనోహర్ జిల్లా పర్యటనలో భాగంగా రైస్ మిల్లుల తనిఖీ చేశారు.. మూడు రైస్ మిల్లుల్లో సుమారు 90 వేల కిలోలు పైనే పట్టుబడ్డాయి.. ఆ తరువాత మంత్రి వెళ్లి పోయారు.. అధికారులు మాత్రం నిద్దరోతున్నారు.. నేటికీ ఒక్క రైస్ మిల్లుపై దాడిచేసిన ఘటనలే లేవు ఎందుకో మరి!

అక్రమ వ్యాపారం ఇలా..

గోకవరం మండలంలో పలువురు రేషన్ బియ్యం అక్రమ వ్యాపారాన్ని కొనసాగిస్తూ కోట్ల రూపాయలు ఆర్జించారనే పుకార్లు ఉన్నాయి. ఏజెన్సీ ప్రాంతాల్లోని గిరిజనుల అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకొని..తద్వారా వారి నుంచి చౌకబియ్యం కొనుగోలు చేసి గోకవరంలో ఏర్పాటు చేసుకున్న రహస్య గొడౌన్లకు తరలిస్తున్నారు. కొనుగోలు తతంగం పూర్తయ్యాక వ్యాపారులతో రహస్య సంబంధాలు కొనసాగించే అధికారులకు సమాచారం చేరవేస్తారు. అప్పుడు వారు చెప్పిన రోజున, చెప్పిన సమయంలో టాటా ఏస్‌లు, ఆటోలు, లారీలు, మినీవాహనాలపై ఇతర ప్రాంతాలకు తరలిస్తున్నారు. జిల్లా వ్యాప్తంగా ఇదే విధానంలో సాగుతోంది. పలు దుకాణాల వద్ద రేషన్ బియ్యం క్రయవిక్రయాలు బహిరంగంగానే సాగుతున్నాయి. తిరుమలాయపాలెం నుంచి ఈ అక్రమ వ్యాపారం జోరుగా సాగుతుంది. రేషన్ బియ్యం అక్రమ రవాణా గురించి ప్రభుత్వ అధికారులు, ఇతర శాఖ అధికారులకు తెలిసినా ఏ మాత్రం చర్యలు తీసుకోవడంలేదనే విమర్శలు ఉన్నాయి. బియ్యం మాఫియా నుంచి దండిగా మామూళ్లు అందడం వల్లే వారు చూసీ చూడనట్టు వ్యవహరిస్తున్నారన్న ఆరోపణలు లేక పోలేదు. గ్రామ స్థాయి నుంచి జిల్లా స్థాయి అధికారుల వరకు ముడుపులు చేరడంతో అక్ర మార్కులు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నారు.



కాపాడండి : కడియంలో మహిళా శక్తి సంఘం వద్ద వీవోఏల ఆందోళన

ఏపీఎం వేధిస్తున్నారు!
కడియంలో డ్వాక్రా సంఘాల వీవోఏల ఆవేదన

కడియం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి) : రాజకీయ నాయకులతో కలిసి మహిళా సంఘాల డీఆర్‌డీఏ ఏపీఎం వేధింపులకు గురిచేస్తున్నారని డ్వాక్రా సంఘాలకు చెందిన పలువురు వీవోఏలు ఆవేదన వ్యక్తం చేశారు. మహిళాశక్తి సంఘం భవనం వద్ద మండలంలోని పలు గ్రామాలకు చెందిన వీవోఏలు ప్రసన్న, లక్ష్మి, పోశమ్మ తదితరులు ఆందోళనకు దిగారు. మేం ఎటువంటి తప్పులు చేయకపోయినా సంఘాల్లో సొమ్ములు గోల్‌మాల్ అయ్యాయంటూ రాజకీయ నాయకులతో కలిసి తమను నానా ఇబ్బందులు పెడుతున్నారన్నారు. మండలంలో ఓ మహిళా సంఘంలో అవకతవకలు జరిగాయని ఆరోపణలు రావడంతో నిజనిర్ధారణ చేసి సమస్యను పరిష్కరించాల్సిన ఏపీఎం రాజకీయనాయకులతో కలిసి సమస్యను మరింత పెద్దది చేశారని ఆరోపించారు. విచారణ పేరుతో చులకనభావంతో చూస్తున్నారన్నారు. చిరుద్యోగులమని చూడకుండా ఏపీఎం దుర్భాషలాడుతున్నారని ఆరోపించారు.జీతాలు సకాలంలో రాకున్నా పనిచేస్తున్న తమపై ఇలా జులుం ప్రదర్శించడం తగదన్నారు. విచారణకు భయపడమని..తప్పులు లేకున్నా దోషులుగా నిలబడడంతో ఆవేదనకు గు ర వుతున్నామన్నారు.ఉన్నతాధికారులు న్యాయం చేయాలని కోరారు.

తూర్పుగోదావరి

• రాజమహేంద్రవరం సిటీ/ రూరల్ • రాజానగరం • అనపర్తి
• కొవ్వూరు • నిడదవోలు • గోపాలపురం



వెళ్లే దారిది: 9 నెలలుగా నిడదవోలు మెయిన్‌రోడ్డు దుస్థితి ఇది..





రోడ్డంతా ఇలా.. వెళ్లేదెలా

9 నెలలైనా ఇంతేనా!

- 9 నెలలుగా సా..గుతున్న పనులు
- నిడదవోలు ఆర్‌వోబీ నిర్మాణంతో అష్టకష్టాలు
- సిబ్బంది కొరత.. నత్తనడకన పనులు
- నిర్మాణంపై కొరవడిన పర్యవేక్షణ
- వాహనదారులకు నిత్యం నరకం

నిడదవోలు, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి) : ఉభయగోదావరి జిల్లాల ప్రజలకు ప్రధాన రహదారి అది.. ఒక్కసారి గేటు పడిందా.. గంటల తరబడి నిలబడిపోవా ల్సిందే..ఎందుకంటే ఆ దారే రహదారి.. అంతటి ప్రాధాన్యం ఉన్న రహదారిపై ఆర్‌వోబీ నిర్మాణ పనులు సాగుతూనే ఉన్నా యి.. దీంతో ప్రజలు ఎంత కాలమిలా అంటూ ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. ఉభయ గోదావరి జిల్లాల వాహనదారుల కల నిడదవోలు పట్టణంలోని ఆర్‌వోబీ నిర్మాణం.గత తెలుగుదేశంప్రభుత్వ హయాంలో అప్పటి ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆ వంతెన నిర్మా ణానికి భూమి పూజ చేసి శంకుస్థాపన చేశారు. అనంతరం వైసీపీ ప్రభుత్వం అధికారంలోకి రావడంతో ఆర్‌వోబీ నిర్మాణం రివర్స్ టెండ రింగ్ పేరుతో నిలిపివేశారు. కానీ కేంద్ర ప్రభుత్వం సేతుబంధన్ నిధు లతో ఆర్‌వోబీ నిర్మాణానికి గ్రీన్ సిగ్నల్ ఇచ్చింది. దీంతో ఈ ఏడాది ఫిబ్రవరి 2వ తేదీన ఆర్వోబీ నిర్మాణ పనులను లాంచనంగా ప్రారంభించా రు. ఇప్పటికి 9 నెలలు పూర్తవుతున్నా పనులు నత్తనడకన సాగుతున్నాయి.ఆ పనుల కారణంగా మెయిన్‌రోడ్డును మూసి వేశారు.దీంతో వ్యాపారాలన్నీ పూర్తిగా నష్టాల బాట పట్టాయి. అంతే కాకుండా ఆ రోడ్డులో వెళ్లాలంటే నరకంగా మారింది. తూర్పుగోదావరి జిల్లా నుంచి నిడదవోలు మీదుగా పశ్చిమగోదావరి జిల్లాలోకి వెళ్లాల్సిన ప్రజలు అష్టకష్టాలు పడుతున్నా రు. ఆర్‌వోబీ నిర్మాణ పనులను ప్రారంభించిన కాంట్రాక్ట్ ఏజెన్సీ పూర్తిస్థాయిలో సిబ్బంది నియామకం చేపట్టకపో వడంతో పనులు నత్తనడ కన సాగుతున్నాయి.ఒకే సర్వీసు రోడ్డు ఉండడంతో రాజమహేంద్రవరం నుంచి తాడేపల్లిగూ డెం,తాడేపల్లిగూడెం నుంచి రాజమహేంద్రవరం వైపు వెళ్లే ప్రయాణికులు నిత్యం ట్రాఫిక్‌తో సతమత మవుతు న్నారు. మెయిన్‌రోడ్డులో రెండో సర్వీసు రోడ్డు సిద్ధంగా ఉన్నప్పటికి కాంట్రాక్ట్ ఏజెన్సీనే కంకర అడ్డంగా పోసి నేటికి ప్రారంభించ కుండా వదిలేసింది.దీంతో వాహనదారులు దారి లేక అష్టకష్టాలు పడుతు న్నారు. ఆర్‌వోబీ నిర్మాణం వచ్చే ఏడాది డిసెంబరు నాటికి పూర్తి కావాల్సి ఉన్నా పనులు జరుగుతున్న తీరు పరిశీలిస్తే మరో రెండేళ్ల పట్టే అవకాశం ఉందని ప్రజలు వాపోతున్నారు. ఇకనైనా మంత్రి దుర్గేష్ స్పందించి పనులు వేగవంతం చేసేలా చూడాలని కోరుతున్నారు.



నిడదవోలు రైల్వే గేటు వద్ద వాహన రాకపోకలు

ఆర్‌కోబీ అంచనాలు ఇలా..

ఆర్‌వోబీ నిర్మాణ వ్యయం	- రూ. 201 కోట్లు
భూసేకరణ	- రూ.21 కోట్లు
సేతుబంధన్ నిధులు	- రూ.24 కోట్లు
కేంద్ర రైల్వేశాఖ వాటా	- రూ.56 కోట్లు
ఆర్వోబీకి సేకరించవలసిన భూమి వివరాలు	
సేకరించాల్సిన భూమి	- 6.14 ఎకరాలు
ప్రభుత్వ భూమి	- 5.11 ఎకరాలు
ప్రయివేటు భూమి	- 1.03 ఎకరాలు
స్థల యజమానులు	- 51 మంది

ప్రతిక్షణం అప్రమత్తంగా ఉండాలి

- చిన్న పొరపాటుకూ తావివ్వొద్దు
- రాజమహేంద్రవరం రైల్వే స్టేషన్‌లో పీసీఎస్‌వో తనిఖీలు



ఆటోమేటిక్ ఇంటర్ లాకింగ్ పని తీరును నిశితంగా పరిశీలిస్తున్న పీసీఎస్‌వో వెంకట రమణా రెడ్డి

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): చిన్న విషయంపై అలసత్వం వహించవద్దని దక్షిణ మధ్య రైల్వే ప్రిన్సిపల్ చీఫ్ సెఫ్టీ ఆఫీసర్ (పీసీఎస్‌వో) కె.వెంకట రమణా రెడ్డి సూచించారు. రాజమండ్రి ప్రధాన రైల్వే స్టేషన్‌లో మంగళవారం ఉదయం మొదలు పెట్టి రాత్రి వరకూ కలియదిరుగుతూ విస్తృతంగా తనిఖీలు చేశారు. ఇటీవల చెన్నైలో జరిగిన రైలు ప్రమాదం దృష్ట్యా ఈ ఆడిట్ ఇన్‌స్పెక్షన్ ప్రాధాన్యం సంత రించుకొంది. ఏదో వచ్చామా చూశామా అని కాకుండా ప్రతి అంశాన్నీ సీపీఎస్‌వో నిశితంగా పరిశీలించారు. భద్రతపై పలు సూచనలు చేయడంతో పాటు సాంకేతికంగా వచ్చే ఇబ్బందులు, ముందస్తుగా గుర్తించి తగు చర్యలు తీసుకోవడంపై అధికారులకు, సిబ్బందికి అక్కడికక్కడే కౌన్సెలింగ్ చేశారు. మెము కార్ షెడ్‌ని రెండు గంటలు పరిశీలించారు. ట్రాక్ పాయింట్లు, సిగ్నలింగ్ తదితర చోట్ల నిశితంగా పరిశీలన జరిపారు. రోడ్(ట్రాక్) నెం.2లో ఉన్న 49ఏ ఇంటర్ లాకింగ్ జంక్షన్ బాక్స్ వద్ద తనిఖీ చేసి స్వల్ప సాంకేతిక లోపాన్ని గుర్తించి సిబ్బందిని నిలదీశారు. నిధులు, సామగ్రి కొరత ఉందా అని ప్రశ్నించారు. ప్రతి క్షణం అప్రమ త్తంగా ఉండాలని ఆదేశించారు. పరీక్షలు నిర్వహించే పరికరాలు ప్రమాణాల ప్రకారం పని చేసే విధంగా ఉండాలన్నారు. ట్రాక్‌లలోని అన్ని పాయింట్లనూ చెక్ చేశారు. మెడికల్, యాక్సిడెంట్ రిలీఫ్ వ్యాన్లలోని పరికరాలను గమనించారు. డిప్యూటీ ఎస్ఎస్ గదిలోని సాంకేతిక వ్యవస్థ పని తీరును పరిశీలించారు. డిప్యూటీ ఎస్ఎస్‌కి లోకో పైలెట్ల(రైలు డ్రైవర్లు)కు మధ్య సమాచార మార్పిడి సవ్యంగా జరుగుతుందా అనే అంశాన్ని గమనించారు. క్రూలాబీని తనిఖీ చేసి పలు సూచనలు చేశారు. సీపీఎస్‌వో వెంట సీఈ/టీఎం కృష్ణారెడ్డి, సీవోఎం/జీ/సీవోఎం రవిచందర్, సీఈ/జీఈ విష్ణు కాంత్, గతిశక్తి చీఫ్ ప్రాజెక్టు మేనేజర్ (విజయవాడ) విట్టల్, ఏడీఆర్ఎం శ్రీనివాస్, ఏడీఈఎన్ చీమల ముత్యాలరావు, ఆర్పీఎఫ్ ఇన్‌స్పెక్టర్ సైదయ్య, పీడబ్ల్యుఐ ఎ.రవి, ఎస్ఎంఆర్ రంగనాథ్ తదితరులు ఉన్నారు.

గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే ముప్పిడి



దొమ్మేరులో శిలాఫలకాన్ని ఆవిష్కరించిన ఎమ్మెల్యే ముప్పిడి

కొవ్వూరు/తాళ్లపూడి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): గ్రామీణ ప్రాంతాల అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం పనిచేస్తోందని ఎమ్మెల్యే ముప్పిడి వెంకటేశ్వరరావు అన్నారు. కొవ్వూరు మండలం పశివేదల, నందమూరు, దొమ్మేరు, తాళ్లపూడి మండలం అన్నదేవరపేటలో గ్రామాల్లో మంగళవారం పల్లె పండుగ వారోత్సవాల్లో భాగంగా చేపట్టనున్న పనులకు ఆయన శంకుస్థాపనలు చేశారు. పశివేదలలో సర్పంచ్ తుం పల్లి సింహాచలం అధ్యక్షతన జరిగిన కార్యక్రమానికి ఎమ్మెల్యే ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. బీసీ, ఓసీ ఏరియాల్లో రెండు సీసీ రోడ్లు, వేములూరులో చేపట్టనున్న 3 సీసీ రోడ్ల పనులకు శిలాఫలకాలను ఆవిష్కరించి శంకుస్థాపనలు చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కాకర్ల నారాయుడు, జడ్పీటీసీ బొంతా వెంకటలక్ష్మి, తుంపల్లి ఆదినారాయణ, బేతిన నారాయణ, గారపాటి శ్రీనివాస్, రామచంద్రరావు, ఎంపీడీవో కె.సుశీల పాల్గొన్నారు. నందమూరులో ఎస్సీ ఓసీ ప్రాంతాల్లో చేపట్టనున్న 2 సీసీ రోడ్లు, దొమ్మేరు సావరంలో సీసీ రోడ్ల పనులకు శంకుస్థాపన చేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం అయిదేళ్లుగా గ్రామాల్లో అభివృద్ధిని పట్టించుకోకపోవడంతో పూర్తిగా కుంటుపడిందన్నారు. అంచెలంచెలుగా రోడ్లు, డ్రైనేజీల నిర్మాణం, తాగునీటి సరఫరా, డంపింగ్ యార్డులను ఏర్పాటు చేసి ప్రజల ఆరోగ్యానికి అధిక ప్రాధాన్యం ఇస్తామన్నారు. కార్యక్రమంలో అన్నదేవరపేటలో జీవీ ప్రసాద్, చెవురి బంగార్రాజు , కూటమి నాయకులు, అధికారులు పాల్గొన్నారు.



గోపాలపురం మండలం పెద్దాపురంలో అబ్దుల్‌కలాం చిత్రపటానికి పూలమాలలు వేస్తున్న ఉపాధ్యాయులు



దివాన్‌చెరువులో అబ్దుల్ కలాం చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న వీసీ శ్రీనివాసరావు తదితరులు



అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పిస్తున్న విద్యార్థులు

ఆదర్శమూర్తి అబ్దుల్‌కలాం

నన్నయ విశ్వవిద్యాలయం వీసీ శ్రీనివాసరావు

దివాన్‌చెరువు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మాజీ రాష్ట్రపతి అబ్దుల్ కలాం ప్రతి ఒక్కరికి ఆదర్శమూర్తి అని ఆదికవి నన్నయ విశ్వవిద్యాలయం ఉపకులపతి ఆచార్య వై.శ్రీనివాసరావు అన్నారు. మంగళవారం నన్నయ విశ్వవిద్యాలయంలో అబ్దుల్ కలాం జయంతిని నిర్వహించారు. కలాం చిత్రపటానికి వీసీ నివాళులర్పించారు. సమావేశంలో ఆయన మాట్లాడుతూ దేశం కోసం జీవితాంతం శ్రమించిన మహనీయుడు కలాం అని కొనియాడుతూ నివాళులర్పించారు. కార్యక్రమంలో కోఆర్డినేటర్ పి.విజయనిర్మల, అధ్యాపకులు తదితరులు పాల్గొన్నారు.

తాళ్లపూడి: అబ్దుల్ కలాం జయంతిని రాగోలపల్లి మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో నిర్వహించినట్టు పాఠశాల ప్రధానోపాధ్యాయుడు డి.దుర్గారావు తెలిపారు. ఈ సందర్భంగా కలాం చిత్రపటానికి విద్యార్థులు నివాళులర్పించారు. కార్యక్రమంలో ఆయా కుమారి, మధ్యాహ్న భోజన కార్మికురాలు వరలక్ష్మి పాల్గొన్నారు. తాళ్లపూడి శ్రీవిజేత హైస్కూల్‌లో ప్రధానోపాధ్యాయుడు ప్రమోద్ అబ్దుల్ కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో దేశానికి కలాం చేసిన సేవలను పలువురు కొనియాడారు.

గోపాలపురం: అబ్దుల్ కలాం జయంతిని మంగళవారం ప్రభుత్వ, ప్రైవేటు కార్యాలయాల్లో జరిపారు. ఈ సందర్భంగా ఆయన చిత్రపటానికి పలువురు నివాళులర్పించారు. ఈ సందర్భంగా వక్తలు మాట్లాడుతూ కలలు కనండి వాటిని సాకారం చేసుకోండి అనే సందేశాన్ని యువత ఆదర్శంగా తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

విద్యార్థులంటే కలాంకు మక్కువ

కొవ్వూరు: విద్యార్థులంటే అబ్దుల్ కలాంకు చాలా ఇష్టమని కొవ్వూరు ఏబీఎన్ పీఆర్ఆర్ కళాశాల ఉన్నత భారత్ అబియాన్ కోఆర్డినేటర్ డాక్టర్ రమేష్ ఎల్లాప్రగడ అన్నారు. మంగళవారం అల్లూరి బాపినీడు, పెండ్యాల రంగారావు డిగ్రీ కళాశాలలో కళాశాల ఎన్ఎస్ఎస్ యూనిట్ ఉన్నత భారత్ అబియాన్‌ల సంయుక్త ఆధ్వర్యంలో కలాం జయంతిని నిర్వహించారు. కలాం చిత్రపటానికి నివాళులర్పించారు. కార్యక్రమంలో బి.సత్యనారాయణ, కె.సూరిబాబు, పిల్లి మురళీధర్, ఎన్.శివనారాయణ, ఎ.శ్రీనివాసు, విద్యార్థులు పాల్గొన్నారు.



ముసుళ్ళకుంటలో సీసీ రోడ్డుకు శంకుస్థాపన చేస్తున్న ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు

అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే శంకుస్థాపనలు

నల్లజర్ల, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మండలంలో పలు అభివృద్ధి పనులకు ఎమ్మెల్యే మద్దిపాటి వెంకటరాజు శంకుస్థాపనలు చేశారు. పల్లె పండుగలో భాగంగా మంగళవారం అచ్చన్నపాలెంలో కాల్వల నిర్మాణానికి శంకు స్థాపన చేశారు. ఘంటావారిగూడెం, దూబచర్ల, అయ్యవరం, ముసుళ్ళకుంట, పుల్లలపాడులలో సీసీ రోడ్డు పనులకు శంకుస్థాపనలు చేసినట్టు ఎమ్మెల్యే తెలిపారు. పంచాయతీలను పటిష్టం చేసేందుకు ముఖ్యమంత్రి చంద్రబాబు, ఉపముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ నిరంతరం శ్రమిస్తున్నారన్నారు. కార్యక్రమంలో టీడీపీ మండలాధ్యక్షుడు తాతిన సత్యనారాయణ, డ్వామా పీడీ నాగ మలేశ్వరావు, తహశీల్దార్ శాంతిప్రియ, టీడీపీ జిల్లా నాయకులు కూచిపూడి ఉదయ బాస్కరావు, ఈడే శ్రీను తదితరులతో పాటు, ముళ్ళకుంట సర్పంచ్ నందమూరి శారదాదేవి, రామకృష్ణ, రావూరి వెంకట రమణ, అచ్యుత సత్యనారాయణ, చుక్క శ్రీను, టీడీపీ ఎస్సీ సెల్ నాయకుడు బోడిగడ్ల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

పల్లె పండుగలో మంత్రి దుర్గేష్



గోపవరంలో పాఠశాల అదనపు గదిని ప్రారంభించిన మంత్రి దుర్గేష్

నిడదవోలు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సంక్షేమం, అభివృద్ధే ధ్యేయంగా కూటమి ప్రభుత్వం ముందుకెళుతుందని రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖా మంత్రి కందుల దుర్గేష్ అన్నారు. మంగళవారం నిడదవోలు మండలం విజ్జేశ్వరం, గోపవరం, కలవచర్ల, జీడిగుంట, కోరుపల్లి, పెండ్యాల, మునిపల్లి గ్రామాల్లో పల్లెపండుగ నిర్వహించారు. గోపవరంలో ప్రభుత్వ పాఠశాల అదనపు గదిని ప్రారంభించిన అనంతరం మాట్లాడారు. దీపావళి నుంచి ఉచిత గ్యాస్ సిలెండర్ పథకం అమలు చేస్తున్నామన్నారు. కార్యక్రమంలో అధికారులు, స్థానిక ప్రజా ప్రతినిధులు పాల్గొన్నారు.

కంసాలిపాలెం ఘటన విచారకరం: కంసాలిపాలెంలో సోమవారం జరిగిన పల్లెపండుగలో మంత్రితో తెలుగుదేశం పార్టీ గ్రామ నాయకుల వాగ్వివాదంపై మంగళవారం జనసేన నాయకులు విలేకరుల సమావేశంలో విచారం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో రంగా రమేష్, ఎమ్‌డి అక్రమ్ తదితరులు పాల్గొన్నారు.

ఉండ్రాజవరం: ప్రభుత్వం రోడ్ల నిర్మాణానికి అధిక ప్రాధాన్యం ఇచ్చినట్లు మంత్రి దుర్గేష్ పేర్కొన్నారు. మంగళవారం రాత్రి వేలివెన్ను గ్రామంలో ఆయన రోడ్డు పనులకు శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ అత్తిలి సత్యనారాయణ, ఉపసర్పంచ్ బూరుగుపల్లి శ్రీనివాసరావు, తహశీల్దార్ పీఎన్‌డీ ప్రసాద్, అధికారులు, కూటమి నాయకులు, కార్యకర్తలు, గ్రామస్థులు పాల్గొన్నారు.

హెల్ప్‌లైన్‌తో దోచేశాడు

- 55,999 సొమ్ము వెనక్కి
- సైబర్ క్రైంలో పోగొట్టుకున్న వ్యక్తి
- 10 రోజుల్లో కేసు ఛేదన

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): సైబర్ నేరగాళ్లు కాజేయడానికి ప్రయత్నించిన సొమ్మును జిల్లా సైబర్ క్రైం పోలీసులు చాకచక్యంగా వెనక్కు రప్పించారు. మల్లికార్జున నగర్‌లో నివాసం ఉంటున్న కె.శ్రీకాంత్ యాక్సిస్ బ్యాంకు క్రెడిట్ కార్డు ఎంపిన్ నెంబరు మర్చిపోయారు. ఈ నెల 5న కస్టమర్ కేర్ నంబరు గురించి గూగుల్‌లో సెర్చ్ చేశారు. ఓ నకిలీ కస్టమర్ కేర్ నంబరు వచ్చింది. దీనికి ఆయన కనెక్ట్ కాగానే అవతల నుంచి ఓ వ్యక్తి మాట్లాడుతూనే ఓ యాప్ క్రియేట్ చేశాడు. అతను కోరిన విధంగా శ్రీకాంత్‌కి వచ్చిన ఓటీపీని చెప్పారు. అంతే.. క్రెడిట్ కార్డులో రూ.55,999ని సైబర్ నేరగాడు తన ఖాతాకు బదిలీ చేసుకున్నాడు. వెంటనే సైబర్ క్రైం హెల్ప్‌లైన్ నెం.1930 కనెక్ట్ కాకపోవడంతో సైబర్ క్రైం పోలీసులకు సమాచారం ఇచ్చారు. దీంతో వెంటనే స్పందించిన పోలీసులు.. ఆ సొమ్మును ఫ్రీజ్ చేసి పది రోజుల్లో వెనక్కి రప్పించి బాధితుడికి అందజేశారు. కేసులో ప్రతిభ చూపిన సైబర్ సెల్ ఇన్‌స్పెక్టర్ జి.ఉమా మహేశ్వరరావు, ఎస్ఐ అయ్యప్పరెడ్డి, సిబ్బంది వైఎస్‌వీ సురేశ్, పి.దుర్గా ప్రసాద్, ఎ.అరవింద్‌ని ఎస్పీ నరసింహ కిషోర్ ప్రత్యేకంగా అభినందించారు. సైబర్ క్రైం బారిన పడి మోసపోయామని గుర్తించిన వెంటనే 1930 నెంబరుకు కాల్ చేయాలని లేదా సైబర్ క్రైం వెబ్‌సైటులో ఫిర్యాదు చేయాలని ఆయన సూచించారు. ఈ విధమైన మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని ఎస్పీ చెప్పారు.

మహిళలు ఆర్థికంగా ఎదగాలి

దేవరపల్లి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళలు ఆర్థికంగా, రాజకీయంగా ఎదగాలని సర్పంచ్ కడిమి వీరకుమారి కోరారు. అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం సందర్భంగా స్థానిక పంచాయతీ కార్యాలయంలో సర్పంచ్‌తో పాటు వార్డు సభ్యులు గద్దే రమాదేవి, చల్లా లక్ష్మి, సచివాలయ ఉద్యోగులను సన్మానించారు.

ఆరోగ్యంపై అవగాహన ర్యాలీ



దూబచర్లలో వైద్య ఉద్యోగుల అవగాహన ర్యాలీ

నల్లజర్ల, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): అందరికి ఆరోగ్యం మా లక్ష్యం అంటూ దూబచర్లలో వైద్య ఉద్యోగులు మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. అంతర్జాతీయ గ్రామీణ మహిళా దినోత్సవం, గర్భస్థ, శిశు మరణాల జ్ఞాపకార్థ దినోత్సవం, ప్రపంచ చేతుల పరిశుభ్రత దినోత్స వం మూడు కార్యక్రమాలను కలిపి అందరికి ఆరోగ్యం పేరుతో కార్యక్రమం చేపట్టారు.స్వచ్ఛంద సేవ సంస్థ అమెన్ ట్రస్ట్ వ్యవస్థాపక అధ్యక్షులు ఇవాంజలిన్ ఆశోక్ సహకారంతో నల్లజర్ల ప్రభుత్వ వైద్య ఉద్యోగులు దూబచర్ల డైట్ కళాశాలలో అవగాహన సదస్సు ఏర్పాటు చేశారు. అనంతరం విద్యార్థులతో గ్రామాల్లో అవగాహన ర్యాలీ నిర్వహించి ఆరోగ్యంపై ప్రజలు తీసుకోవలసిన జాగ్రత్తలు తెలిపారు. కార్యక్రమంలో జీవీవీ ప్రసాద్, అన్నమ్మ, జరీనా, పుష్ప, ధనలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయుడి మృతి



గోపాలపురం, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో ఉపాధ్యాయుడు కొనకళ్ళ గణేష్‌కుమార్ తీవ్రంగా గాయపడి మృతి చెందిన ఘటన గోపాలపురం గ్రామశివారులో మంగళవారం జరిగింది. ఎస్ఐ కే.సతీష్ కుమార్ వివరాల ప్రకారం... నిడదవోలు మండ లం బ్రాహ్మణగూడెంలో గణేష్‌కుమార్ ఉపాధ్యాయుడిగా పనిచేస్తూ శమిస్రగూడెంలో ఉంటున్నట్టు తెలిపారు. మంగళవారం స్వగ్రామం అయిన బొర్రంపాలెం బైక్ పై వెళుతుండగా గోపాలపురం గ్రామ శివారులో ఎదురుగా వస్తున్న లారీ ఢీకొనడంతో తీవ్ర గాయాల య్యాయని ఎస్ఐ తెలిపారు. వెంటనే ప్రథమ చికిత్స కోసం గోపాల పురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రానికి తరలించినట్టు తెలిపారు. మెరుగైన వైద్యం కోసం రాజమండ్రిలోని బొల్లి నేని ఆసుపత్రికి తీసుకెళుతుండగా మార్గమధ్యలో మృతి చెందినట్టు తెలిపారు. అతని భార్య బేబీ ఆదిలక్ష్మి ఫిర్యాదు మేరకు కేసు దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ తెలిపారు.

ప్రభుత్వ పథకాలపై అవగాహన అవసరం

చాగల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అమలు చేస్తున్న పథకాలపై ప్రజలకు అవగాహన అవసరమని సుంకవల్లి ఫౌండేషన్ చైర్మన్ సుంకవల్లి వెంకన్న చౌదరి అన్నారు. మంగళవారం ఆయన మార్కొండపాడులో మాట్లాడుతూ ఆరోగ్య ఆయుష్మాన్ పథకం వృద్ధులకు ఉపయోగకరమన్నారు. జాతీయ పెన్షన్ పథకం, చిన్న సుకన్య సమృద్ధి యోజన ఉపయోగపడాయన్నారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వ పథకాలపై సుంకవల్లి ఫౌండేషన్ ఆధ్వర్యంలో ప్రజలకు అవగాహన కల్పించే విధంగా కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఆయా పార్టీల నాయకులు ప్రభుత్వ పథకాలపై ప్రజలకు అవగాహన కలిగించాలన్నారు.

రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు
విద్యార్థుల ఎంపిక



తాళ్లపూడి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): గజ్జరం హైస్కూల్ విద్యార్థులు రాష్ట్ర స్థాయి యోగా పోటీలకు ఎంపికయినట్టు పాఠశాల హెచ్ఎం మోహన్ తెలిపారు. మంగళవారం ఏలూరులో నిర్వహించిన జిల్లాస్థాయి యోగా పోటీలలో ఎం. మిల్కీ, జి. శరణ్‌తేజ్‌లు ప్రతిభ కనబర్చడంతో రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికయ్యారన్నారు. ఈ సందర్భంగా పాఠశాలలో మంగళవారం విద్యార్థులతో పాటు వ్యాయామ ఉపాధ్యాయులును అబినందించారు. ఈ కార్యక్రమంలో యోగా టీచర్ జి. విద్యాసాగర్, జె. సందీప్‌లు పాల్గొన్నారు.

మామిడిచెట్టు పడి మహిళ మృతి





సుబ్బలక్ష్మి మృతదేహాన్ని పరిశీలిస్తున్న పోలీసులు (ఇన్‌సెట్లో) ఫైల్‌ఫొటో

దేవరపల్లి, అక్టోబరు 15 (ఆంధ్రజ్యోతి): మామిడిచెట్టు పడి మహిళ మృతిచెందిన సంఘటన దేవరపల్లి మండలం అచ్చియ్యపాలెంలో జరిగింది. పోలీసులు, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాల ప్రకారం.. అచ్చియ్యపాలెం గ్రామానికి కు చెందిన పీతల సుబ్బలక్ష్మి(48) మంగళవారం సాయంత్రం ఇంటి ముందు పరిసరాలను శుభ్రం చేస్తుండగా ఎదురుగా ఉన్న గంటా లక్ష్మి తన ఇంటి నిర్మాణం కోసం మామిడి చెట్టు నరుకుతుండగా చెట్టు మొదలు సుబ్బలక్ష్మిపై పడింది. ఈ ఘటనలో తలకు తీవ్ర గాయమై అక్కడికక్కడే మృతి చెందింది. కాగా సుబ్బలక్ష్మి ఇద్దరు కుమారులు, ఇద్దరు కుమార్తెలు ఉన్నారు. వారిలో ఒక కుమారుడు మానసిక దివ్యాంగుడు కాగా మిగిలిన ముగ్గురికి వివాహాలయ్యాయి. భర్త పీతల గోతియ్య ఫిర్యాదు మేరకు కేసునమోదు చేసినట్టు ఎస్ఐ వి.సుబ్రహ్మణ్యం తెలిపారు.

ఆకతాయిల ఆటకట్టించిన
మహిళా రక్షక్ టీం

రాజమహేంద్రవరం, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): మహిళా రక్షక్ పోలీసులు ఆకతాయిల ఆటకట్టించారు. సోమవారం అర్ధరాత్రి 1.30గంటల సమయంలో రైల్వే స్టేషను ప్రాంగణంలో ఓ మహిళ ఒంటరిగా వేచి ఉన్నారు. ఆకతాయిలు ఆమె వద్దకు వెళ్లి కేకలు వేస్తూ ఇబ్బంది పెట్టడం మొదలు పెట్టారు. పెట్రోలింగ్‌లో ఉన్న మహిళా రక్షక్ టీం వాళ్లను గమనించి అదుపులోకి తీసుకొని టూటౌన్ పోలీస్ స్టేషనుకు తీసుకెళ్లి కౌన్సెలింగ్ చేసి మరోసారి ఆ విధంగా ప్రవర్తిస్తే కటకటాలు తప్పవని హెచ్చరించారు. ఈ సందర్భంగా మహిళా రక్షక్ టీంను ఎస్పీ నరసింహ కిషోర్ అభినందించారు.

'మాదిగ వారి ఇంటి పేర్లు'
పుస్తకావిష్కరణ



తాళ్లపూడి, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): తాళ్లపూడి మండలంలోని పైడిమెట్ట గ్రామంలో మాజీ వీసీ పి.జార్జివిక్టర్, రిటైర్డ్ జిల్లా జడ్జి గాంగేయుడు చేతుల మీదుగా పీవీ రామ్ రూపొందించిన మాదిగ వారి ఇంటి పేర్లు పుస్తకావిష్కరణ జరిగింది. వక్తలు మాట్లాడుతూ మాదిగ అస్తిత్వానికి, జాతి ఉన్నతికి ఇటువంటి రచనలు దోహదం చేస్తాయని డా. రామ్‌ని అభినందించారు. కార్యక్రమంలో పెనుమాక జయరాజు, బొల్లిపో మధు, పీవీ రవి రత్నప్రకాష్, జలమయ్య తదితరులు పాల్గొన్నారు.

అభ్యాసన వైకల్యాలు అధిగమించాలి



చాగల్లులో అభ్యాసన వైకల్యాలపై విద్యార్థుల అవగాహన ర్యాలీ

చాగల్లు, అక్టోబరు 15(ఆంధ్రజ్యోతి): విద్యార్థుల్లోని అభ్యాసన వైకల్యాలు అధిగమించడానికి ప్రభుత్వం కల్పిస్తున్న అవకాశాలు వివరిస్తూ మంగళవారం అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎంఈవో యు.గురునాథం మాట్లాడుతూ ప్రభుత్వం ప్రతి మండలంలో భవిత కేం ద్రాలు ఏర్పాటు చేసి దివ్యాంగులకు విద్య బోధనపై ప్రత్యేక శిక్షణ ఇస్తోందని చెప్పారు. తల్లిదండ్రులు పిల్లల పట్ల అవగాహన కలిగి ఉపాధ్యాయులతో సంప్రదించాలన్నారు. దివ్యాంగుల కోసం ప్రతి బుధవారం జరిగే ఫిజియోథెరపీని ఉపయోగించుకోవాలని కోరారు. కార్యక్రమంలో ఐఈఆర్‌టీ ఎం శిరీషా, ఐఈడీ టీచర్ నాగపూర్ణిమ, హెచ్ రామలక్ష్మి, సీహెచ్ సుభాకర్ పాల్గొన్నారు.

సినిమా గైడ్

కొవ్వూరు	
యువరాజ్‌మాల్ స్క్రీన్1	: వేట్టయన్
వై.స్క్రీన్2	: విశ్వం
దేవిశ్రీ(గాయత్రి	: మార్టిన్
అనన్య	: దేవర
నిడదవోలు	
వీ మ్యాక్స్	: దేవర
రాధాకృష్ణ	: వేట్టయన్
శ్రీగణపతి	: మార్టిన్
దేవరపల్లి	
శ్రీరామ్‌నాథ్ సినీ మ్యాక్స్	: దేవర
త్రినాథ్ సినీ మ్యాక్స్	: దేవర